
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





యువర్ అటెన్షన్ ప్లీజ్

విజయదశమి నాటికి పట్టాలు ఎక్కనున్న నరసాపురం-చెన్నై వందే భారత్ ఎక్స్‌ప్రెస్

నరసాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):యువర్ అటెన్షన్ ప్లీజ్.. నెంబరు 20678 నరసాపురం నుంచి చెన్నై వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజయదశమి నాటికి బయలుదేరడానికి సిద్ధంగా వుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. షెడ్యూల్ సమయాలను ఖరారు చేస్తూ రైల్వే బోర్డు పచ్చజెండా ఊపింది. విజయవాడ-చెన్నై మధ్య నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయత్నాలు చేసింది. నరసాపురం స్టేషన్‌లో వందేభారత్ నిర్వహణ, నీటి ఫిల్లింగ్‌కు అనువైన సౌకర్యాలు లేవంటూ సదరన్ రైల్వే అడ్డంకులు కల్పిస్తూ వచ్చినప్పటికి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ వీటిని క్లియర్ చేయిస్తూ వచ్చారు. చివరకు రైల్వే మంత్రిని కలిసి వందేభారత్ అవశ్యకత, ట్రాఫిక్‌ను వివరించడంతో రైల్వే బోర్డు పచ్చ జెండా ఊపింది. తొలి విడతలో ఏ ఏ స్టేషన్లలో ఆగుతుందన్న విషయం ఖరారు కావాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం మేరకు నరసాపురంలో మధ్యాహ్నం 2.10కి బయలుదేరి రాత్రి పది గంటలకు చెన్నై చేరుతుంది. మధ్యలో భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతుంది. ప్రస్తుతం ఈ రైలు విజయవాడ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరుతుంది. తాజాగా అదే సమయానికి విజయవాడ చేరుకునే విధంగా నరసాపురం నుంచి షెడ్యూల్‌ను ఖరారు చేస్తున్నారు. ఇక చెన్నై నుంచి ప్రతిరోజు 20677 నెంబర్‌తో ఉదయం 5.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు నరసాపురం వస్తుంది. పశ్చిమ జిల్లా నుంచి ప్రస్తుతం ఒక సర్కార్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే చెన్నై వెళుతుంది. వందే భారత్‌తో రెండోది అవుతుంది.



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మను ప్రపంచంలోనే మొట్టమొదటి వాస్తు శిల్పిగా భావిస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంప్రదాయ కళా నైపుణ్యాలను కలిగిన వారికి ప్రయోజనం కలిగించేలా విశ్వకర్మ యోజన ద్వారా ప్రభుత్వం సాధికారిత కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమాధికారి నాగరాణి, విశ్వ బ్రాహ్మణ ప్రముఖులు పొట్నూరి శివరాం, ఎలబాక కృష్ణ, కేళ్ల దుర్గాప్రసాద్, కేవీ బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జోరుగా వర్షాలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో బుధవారం పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. గత 24 గంటల్లో జిల్లా లోనే అత్యధికంగా బుట్టాయిగూడెం మండలంలో 58.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 9.2 మి.మీగా నమోదైంది. పెదపాడు 26.6, వేలేరుపాడు 22, జంగారెడ్డిగూడెం 18.6, నిడమర్రు 15.2, జీలుగుమిల్లి 14.4, టి.నరసాపురం 14.2, భీమడోలు 11.2, ద్వారకాతిరుమల 11, ఉంగుటూరు 9, కొయ్యలగూడెం 8.6, దెందులూరు 8.6, పెదవేగి 8.2, కామవరపుకోట 8.2, ఆగిరిపల్లి 5.4, ఏలూరు రూరల్ 4.4, కుక్కునూరు 3.6, నూజివీడు 3.4, ఏలూరు అర్బన్ 3, చింతలపూడి 2.4, చాట్రాయి 1.6 మి.మీ వర్షపాతాలు నమోదు అయ్యాయి.

గోదావరి తగ్గుముఖం

కుక్కునూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద బుధవారం ఉదయం 35.30 అడుగుల నీటిమట్టం నమోదు కాగా సాయంత్రానికి 35.20 నీటిమట్టం నమోదైంది. ఎగువన వరద ప్రవాహం తగ్గడంతో గోదావరి వరద నెమ్మదించింది. కుక్కునూరు గోదావరి తీర ప్రాంతంలో వరద నిలకడగా ఉంది.

ప్రలోభాలకు గురిచేస్తే ఫిర్యాదు చేయండి

» డీఎంహెచ్‌వో పీజే అమృతం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు, ప్రైవేటు ల్యాబ్‌లకు ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తామని నమ్మబలుకుతూ ఇటీవల కొందరు ఆఫీసు కార్యాలయ ఉద్యోగులుగా చెప్పుకుంటూ ఫోన్లు చేసి డబ్బులు అడుగుతూ మోసం చేస్తున్నట్టుగా తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే. అమృతం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అనుమతులిప్పిస్తామని ఇద్దరు మెడికల్ షాపుల దరఖాస్తుదారులకు, స్టాఫ్ నర్సు ఉద్యోగాలిప్పిస్తామని ఇద్దరు మహిళా అభ్యర్థులకు మంగళవారం కొందరు వ్యక్తులు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేశారన్నారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

ఆశలు..ఆకాంక్షలు!



» నేటి నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
» జిల్లాలో అపరిష్కృత సమస్యలెన్నో..
» గళం వినిపించేందుకు ఎమ్మెల్యేలు సన్నద్ధం

ఏలూరు,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై గళమెత్తేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రభుత్వ పథకాలను విజయవంతం చేసినా.. ఇంకా చాలా నియోజక వర్గాల్లో నిధుల్లేమి.. రైతుల సమస్యలు. టిడ్కో ఇళ్లకు మోక్షం లభించక పోవడం, మంచినీటి వనరులు, ఎన్టీఆర్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై తమ వాణి వినిపించడానికి ఎమ్మెల్యేలు తమ లెక్కలు, వివిధ ప్రతిపాదిత అంచనాలతో అసెంబ్లీలోకి అడుగు పెట్టను న్నారు. కొల్లేరు కాంటూరు, ఇరిగేషన్ పథకాలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, ఆక్వా రంగంలో ఒడిదుడుకులు తదితర సమస్యలపై ఎమ్మెల్యేలు తమ వాణిని విన్పిస్తారని జిల్లావాసులు ఆశాభావంతో ఉన్నారు.

ఆయిల్‌పామ్ బోర్డు కోసం..



చింతలపూడి నియోజకవర్గంలో మూడు ఆయిల్ ఫ్యాక్టరీలున్నాయి. 50 వేల ఎకరాల పామాయిల్ సాగవుతుంది. రైతులకు సత్వరం న్యాయం జరిగేలా ఇక్కడ ఆయిల్ పామ్ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తాను. పలుచోట్ల పంట కాల్వల వల్ల మార్జిన్లు దెబ్బతింటు న్నాయి. దీనికి పరి ష్కారానికి చట్టం తేవాలని విన్నవిస్తా. ఆర్ అండ్‌బీలో ఇంజనీర్ల కొరత తీర్చాలి. చింతల పూడి నగర పంచాయతీగా ప్రకటించినా.. పాలకవర్గం లేదు. కనీసం నిధులైన విడుదల చేయాలని సభలో కోరుతాను.

- సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే

వంతెనలు, రోడ్ల నిర్మాణాలకు నిధులు కోరతా..



నియోజకవర్గంలో ప్రధాన వంతెనలైన నారాయణపురం, గణపవరం వంతెనలు శిథిలావస్థకు చేరడంతో వాటి పునర్నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని విన్నవిస్తాను. గత ప్రభుత్వ హయాంలో రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు, పునర్నిర్మా ణానికి నిధుల మంజూరు చేయడానికి కృషి చేస్తాను. సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి నివేదిస్తాను.

- పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎమ్మెల్యే

టిడ్కో ఇళ్లపై ప్రస్తావిస్తా..



గతంలో 4,400 ఇళ్లకు టిడ్కో పథకంలో రూ.25 వేల డీడీలు తీసిన వారికి ఆయా మొత్తాలు తిరిగి వెనక్కి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరతాను. ప్రధానమైన ఏలూరు ఎన్ఆర్‌పేట వద్ద ఓవర్‌బ్రిడ్జి పునరుద్ధరణకు రూ.రెండు కోట్ల ప్రతిపాదన ఏ దశలో ఉందో అడుగుతాను. టీడీపీ హయాంలో ఎన్టీఆర్ కాలనీలో పూర్తి చేసిన మూడువేల ఇళ్లల్లో గృహ ప్రవేశాలకు అనువుగా మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరుకు విన్నవిస్తాను. రూ.15 కోట్లతో శనివారపుపేట వద్ద కాజ్‌వేపై వంతెనను త్వరలో చేపట్టాలని, అమృత్ 2.0 పథకం కింద ప్రతీ ఇంటికి గోదావరి నీటిని పైపులైన్లు విస్తరణ చేయాలని, పుట్టుకతోనే మంచంపైనే ఉన్న దివ్యాంగులకు రూ.10వేలు ఇస్తే వారికి సహాయకులు సేవ చేయడానికి వీలుంటుందని సభ దృష్టికి తీసుకెళ్తా.

- బడేటి రాధాకృష్ణయ్య, ఏలూరు ఎమ్మెల్యే

> జడ్పీ చైర్‌పర్సన్‌తో
>
> ## ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్
>
> ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో ఈ నెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనుంది. ఉమ్మడి జిల్లా జడ్పీ పరిధిలోని ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు, జడ్పీ పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి, గ్రామాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజలు సెల్ నెంబరు 94947 86277కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. వాటి పరిష్కారానికి ఆమె తగిన చర్యలు తీసుకుంటారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

» మంత్రి నారాయణ



ఏలూరులో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, చిత్రంలో ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి, మేయర్ నూర్జహాన్

ఏలూరు టూ టౌన్, సెప్టెం బరు 17(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను వైసీపీ ప్రభుత్వం మిగిల్చి వెళ్లింది. రాష్ట్రాన్ని డంపింగ్ యార్డులా తయారు చేసింది. రోజుకు 50 వేల టన్నుల చెత్తను తొలగిస్తున్నాం. భూమిపైనే కాదు.. లోపల మరో 15 లక్షల టన్నుల చెత్త ఉంది. నవంబరు నెలాఖ రుకు దానిని తొలగించే చర్యలు తీసుకుంటాం' అని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. పోణంగిలోని డంపింగ్ యార్డును, ఏలూరు టిడ్కో గృహాలను సందర్శించారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి వచ్చే ఏడాది జూన్ నాటికి దశల వారీగా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బడేటి మాట్లాడుతూ వైసీపీ హయాంలో డంపింగ్ యార్డులోని చెత్తను కాల్చి పర్యావరణానికి హాని కలిగించారని, దీనివల్ల చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వంలో చెత్తను ఎరువుగా తయారు చేసి వినియోగిస్తున్నామన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ పోణంగి డంపింగ్ యార్డులో ఇప్పటికే 63 శాతం చెత్తను తొలగించామన్నారు. ఈ నెలాఖరు నాటికి మిగిలిన చెత్తను పూర్తిగా తొలగిస్తామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, కమిషనర్ భానుప్రతాప్, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, డిప్యూటీ మేయర్ ఉమా మహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు పెదబాబు, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు. తొలుత ఏలూరు వచ్చిన మంత్రికి కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చంటి, నాయకులు పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు.

లస్కర్ల కొరత



సాగునీటి సరఫరాలో అవస్థలు

బ్రిటిష్ కాలం నుంచి సాగునీటి వ్యవస్థలో భాగంగా కాల్వల నిర్వహణ సాఫీగా సాగేందుకు లస్కర్ల పాత్ర కీలకం. అయితే నాలుగు దశాబ్దాలుగా లస్కర్ పోస్టుల ఖాళీ అవుతున్నా.. వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. దీంతో సాగునీటి నిల్వల నిర్వహణలో లోటుపాట్ల వల్ల రైతాంగానికి సమస్యలు ఎదురవుతున్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

» ఏళ్ల తరబడి పోస్టుల భర్తీ లేదాయె..
» అరకొర సిబ్బందితోనే కాల్వలకు నీటి పంపిణీ
» వరద నియంత్రణలోనూ ఇక్కట్లే
» పట్టించుకోని జలవనరుల శాఖ

పశ్చిమ డెల్టా గోదావరి కాల్వ కింద ఉభయ గోదావరి జిల్లాలో ఐదు లక్షల ఎకరాల వరకు వరి సాగవుతోంది. ప్రధానంగా డెల్టాకు నిడదవోలులోని విజ్జేశ్వరం, ఏలూరు, నరసాపురం కాల్వల ద్వారా గోదావరి పరివాహక ప్రాంతాలకు సాగునీరు సరఫరా అవుతుంటుంది. ఇందులో భాగంగా లాక్ పాయింట్ల నిర్వహణకు లస్కర్ల పాత్ర చాలా కీలకం. వర్కుచార్జుడ్ ఉద్యోగులుగానే 400 మంది డెల్టా వ్యవస్థ కింద పనిచేసేవారు. ఇందులో కీలకమైనవి డెల్టా లస్కర్, కెనాల్ లస్కర్‌గా పోస్టుల వర్గీకరణ జరిగింది. అయితే ఈ స్థానాల్లో రిటైర్ అయిన వారి స్థానంలో కొత్తగా రెగ్యులర్ లస్కర్ల నియామకం జరగడం లేదు. 1994 నుంచి ఒక్కరిని కూడా నియమించలేదు. మెయిన్ కెనాల్ నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఒక లస్కర్ విధులు నిర్వహణ చేయాల్సి ఉంది. దిగువ ప్రాంతాల్లో ఐదువేల ఎకరాలకు ఆయకట్టుకు లస్కర్ విధిగా ఉండాలి.

12 ప్రధాన కాల్వలకు ఇక్కట్లే..

గోదావరి డెల్టాలో ప్రధానంగా ఏలూరు సర్కిల్ పరిధిలోనే 12 మెయిన్ కెనాల్స్ ఉన్నాయి. గోదావరి వెస్ట్రన్ మెయిన్ కాల్వ, కాకరపర్రు కెనాల్, జీఅండ్‌వీ కెనాల్, గోదావరి వెస్ట్రన్ బ్యాంక్ కెనాల్, నరసాపురం కెనాల్, ఏలూరు, అత్తిలి కెనాల్,జంక్షన్ కెనాల్, వెంకయ్య వయ్యేరు కాలనీ, ఓల్డ్ వయ్యేరు కెనాల్, ఉండి కెనాల్స్ ఉన్నాయి. వాస్తవంగా 295 ఒరిజనల్ లస్కర్ పోస్టులుండాల్సి ఉండగా వర్కుచార్జుడ్ సిబ్బంది కింద రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో అధికారులు సాగునీటి కాల్వలు నిర్వాణలో ఇక్కట్లు ఎదుర్కొంటు న్నారు. కేవలం జిల్లా అంతా మొత్తం (మిగతా 8వ పేజీలో)

మహిళల ఆరోగ్యమే సమాజాభివృద్ధి : మంత్రి కొలుసు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని తద్వారా సమాజాభివృద్ధికి దోహదపడుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమశాఖ ద్వారా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు రెండు వారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. మహిళా వైద్యశిబిరాలను జిల్లాలోని 58 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన రాష్ట్రీయ పోషణ మాసం మొదటిరోజు కార్యక్రమంలో 22 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సబ్‌కలెక్టర్ వినూత్న, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో భార్గవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి జగన్ మోహన్‌రావు, సీడీపీవో విజయ కుమారి, అంగన్ వాడీ సూపర్‌వైజర్ రాగమయి, టీడీపీ అధ్యక్షుడు ఎన్.వేణు పాల్గొన్నారు.

పేదింటికి వరం!



» పేదల ఇళ్ల యూనిట్ వ్యయం పెంపు
» ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షల రాయితీ
» పీఎంఏవై 2.0 అమలుకు గ్రీన్ సిగ్నల్
» కొత్తగా మంజూరైన పీఎంఏవై అర్బన్ ఇళ్లకు వర్తింపు
» తాజాగా మార్గదర్శకాలు విడుదల
» జిల్లాలో పీఎంఏవై అర్బన్ ఇళ్లు 1606

ఏలూరుసిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు కట్టిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల యూనిట్ వ్యయాన్ని రూ.1.80 లక్షలు మాత్రమే కేటాయించింది. ఆ ఐదేళ్లు పేదల ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు గృహ నిర్మాణ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఇదే తరుణంలో కేంద్రం తాజాగా ప్రారంభించిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై అర్బన్) 2.0 పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు యూనిట్ వ్యయాన్ని రూ.2.50 లక్షలకు పెంచారు. ఇందులో కేంద్ర వాటాగా గతంలో మాదిరిగానే రూ.లక్షా 50 వేలు, రాష్ట్ర వాటాగా రూ.లక్ష జత చేస్తారు. రాష్ట్రంలో తొలివిడతగా పీఎంఏవై అర్బన్ 2.0 ఇళ్లకు ఈ రాయితీని వర్తింపజేయాలని నిర్ణయించారు.

జిల్లాలో పీఎంఏవై అర్బన్ 2.0 ఇళ్లు 1,606

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెంచిన ఇళ్ల రాయితీ పీఎంఏవై అర్బన్ 2.0కు వర్తింపజేస్తున్నారు. ఇప్పటికే జిల్లా గృహనిర్మాణ శాఖ నిర్వహించిన సర్వేలో సొంతింటి స్థలం ఉన్న వారిని ఈ పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్ 2.0 పథకంలో 1606 ఇళ్లు మంజూరయ్యాయి. ఏలూరు నగరంలో 681, జంగారెడ్డిగూడెం అర్బన్‌లో 252, చింతలపూడిలో 394, నూజివీడులో 279 వరకు ఉన్నాయి. ఈ ఇళ్లన్నింటికీ కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం (మిగతా 8వ పేజీలో)

> **సొంత స్థలం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు..**
>
> జిల్లాలో పేదల గృహ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. లక్ష్యాలను సాధించడంలో జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచింది. జిల్లాలో ఇంకా సొంత స్థలం ఉన్న లబ్ధిదారులు సంబంధిత ధ్రువపత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎంఏవై అర్బన్ పథకంలో కొత్తగా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగానే పూర్తి చేస్తాం. ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.
>
> **- జి.సత్యనారాయణ, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్**

రెండు బార్లకు లైన్ క్లియర్

» ఏడు బార్లకు దరఖాస్తులు నిల్
» ముగిసిన దరఖాస్తు గడువు
» నేడు లాటరీ ద్వారా లైసెన్సులు జారీ

ఏలూరు,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బార్‌ల కేటాయింపులకు దరఖాస్తుల స్వీకరణ గడువు బుధవారంతో ముగిసింది. ఏలూరు నగరంలో 8 బార్లకు, జంగా రెడ్డిగూడెంలో ఒక బార్‌కు ఈనెల 3వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణకు రెండోసారి నోటిఫికేషన్ విడుదల చేశారు.వాస్తవంగా ఈ గడువు ఈనెల 14వ తేదీతో ముగిసింది. అయా బార్లకు దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో మరో మూడు రోజులు ఈ గడువు పొడిగించారు. చివరి రోజు బుధవారం ఈ షాపులకు మిశ్రమ స్పందన లభించింది. ఏలూరు నగరంలో రెండు షాపులకు ఎనిమిది దరఖాస్తులు దాఖలయ్యాయి. నగరంలో ఒకటో నెంబర్ బార్‌కు నాలుగు, 8వ నెంబర్ షాపునకు 4 దరఖాస్తుల చొప్పున దాఖలయ్యాయి. దీంతో ఈ రెండు బార్ల లైసెన్సుల కేటాయింపులకు లైన్ క్లియర్ అయ్యింది. ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం ఉదయం 10 గంటలకు లాటరీ తీసి లైసెన్సులను కేటాయించ నున్నట్టు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. తొమ్మిది బార్లకు రెండింటికి లైసెన్సులు జారీకి లైన్ క్లియర్ అవ్వడంతో నగరంలో మిగిలిన 6 బార్లు, జంగారెడ్డిగూడెంలో ఒక బార్‌కు మళ్లీ త్వరలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది.

22 నుంచి దసరా సెలవులివ్వాలి

» డీపీఆర్టీయూ డిమాండ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమావాస్య తర్వాత మరుసటిరోజు (సెప్టెంబరు 22) నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని అధికారికంగా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని పాఠశాలలకు దసరా సెలవులను అదేరోజు నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డెమొక్రటిక్ పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో పాఠశాలవిద్య డైరెక్టర్ విజయరామరాజును కలుసుకుని అంద జేసిన వినతిపత్రం నకళ్లను సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు స్థానిక మీడియాకు విడుదల చేశారు. ఈ ఏడాది విద్యాశాఖ విడుదల చేసిన అకడమిక్ కేలండర్ ప్రకారం పాఠశాలలకు దసరా సెలవులను ఈనెల 24 నుంచి అక్టోబరు 2వరకు ఇస్తున్నట్టు పేర్కొన్నారని వివరించారు. దసరా పర్వదినాన్ని అందరూ జరుపుకోవడానికి వీలుగా సెలవులను ఈనెల 22 నుంచే ఇచ్చేలా ప్రకటించాలన్నారు. పండుగ సందర్భంగా దూరప్రాంతాలకు ప్రయాణం చేసే టీచర్ల సౌకర్యార్థం అక్టోబరు 3న సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తదితర ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని వివరిం చారు. విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన డీపీఆర్టీయూ నాయకుల్లో రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు ఉన్నారు.

చింతలపూడికే మెగా లబ్ధి

» నేడు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ అభ్యర్థులు ఏలూరు చేరిక
» అమరావతి వెళ్లేందుకు 2,292 మందికి వసతి, ప్రయాణ ఏర్పాట్లు

■ లోపలి పేజీలో..

శ్రీగంధం చెట్లు కొట్టేస్తారు..

» పగలు పూసలు అమ్ముతున్నట్టు నటిస్తూ రెక్కీ..
» మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠా అరెస్టు



తణుకు ఇంద్రయ్య కళాశాలలో ఉద్యోగ మేళాకు హాజరైన అభ్యర్థులు

ఉద్యోగ మేళాలో 60 మంది ఎంపిక

తణుకు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజి నందు జరిగిన ఉద్యోగ మేళాలో 60 వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు చెప్పారు. కళాశాల్లో జరిగే జాబ్ మేళాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమ భవిష్యత్ అభివృద్ధికి ఒక సుస్థిరమైన వేదికగా మార్చుకోవాలని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ లోకమన్‌తో పాటు పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 172 మంది అభ్యర్థులు హాజరవగా 60 మంది ఎంపికైనట్లు వివరించారు. స్పెషలాఫీసర్ ప్రభాకర్, నాగభూషన్‌రెడ్డి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



నీలాద్రిపురంలో ఆదరాబాదరాగా బస్తాలు కడుతున్న రైతులు

అన్నదాతను వెంటాడుతున్న వాతావరణం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెం మండలంలో వరిమాసూళ్లు ముమ్మరంగా సాగుతుండగా వాతావరణం భయపెడుతోంది. ఉదయం ఎండగా ఉందని కోతలు మొదలు పెట్టిన రైతులకు మధ్యాహ్నం మబ్బులు వేసి చినుకులు పడుతూ రైతుల్లో గుబులు రేపుతోంది. ఒకపక్క సరైన ధర లేక రైతులు అయిన కాడికి అమ్ముకుందామని మాసూళ్లు చేస్తుంటే ఈ వాతావరణం మరింత ఇబ్బంది పెడుతోంది. కొందరు దళారులు ఇదే అదనుగా ధాన్యం ధరల్లో కోతలు పెడుతున్నారు. రూ.1350 ఉన్న ధరను రూ.1200 అని చెబుతూ రైతులను దోచుకుంటున్నారు.



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాళ్లకూరు వెంకన్న పవిత్రోత్సవాలు

కాళ్ళ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తనదీ జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రెండవ రోజైన బుధవారం స్వామి, అమ్మవార్లకు అగ్ని ప్రతిష్ట, కుంభావాహన, యాగశాల అర్చన, ప్రత్యేక హోమాలు,సాయంత్రం స్వామి,అమ్మవార్లకు పవిత్రాల సమర్పణ, తీర్థ గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో మోకా అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ 35.19 లక్షలు

భీమవరం టౌన్,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయంలో బుధవారం జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్యప్రకాష్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కించారు.. రెండు నెలలు కాలానికి 35 లక్షల 19 వేల 016 రూపాయలు ఆదాయంగా వచ్చింది దీంతో పాటు బంగారం 51 గ్రాములు, వెండి 160 గ్రాములు వచ్చింది. 121 అమెరికా డాలర్‌లు, 10 కెనడా డాలర్‌లు వచ్చినట్లు దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు.. దేవదాయ శాఖ ఇనస్పెక్టర్ వెంకటేశ్వరావు, దేవస్థానం ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ, కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ గ్రంధి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.15 లక్షలు



మొగల్తూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 60 రోజులకు గాను రూ.15 లక్షల 72 వేల 090 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయ ఈవో కృష్ణంరాజు పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరిపినట్టు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.



మొగల్తూరులో నడివీధి ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు,గ్రామస్థులు

నడివీధి ముత్యాలమ్మ పునఃప్రతిష్ఠ పూజలు

మొగల్తూర, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ ఆలయ పూరిపాక, ఘటాలు దగ్ధం అవడంతో వాటి స్థానంలో నూతనంగా పూరిపాక, ఘటాలు పున ప్రతిష్ఠించేందుకు బుధవారం నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు ప్రారంభించారు. ప్రముఖ సిద్ధాంతి అనిల్ కుమార్ ఆచార్యులు సూచించిన విధంగా బుధవారం ఉదయం 10.40 నిమిషాలకు కొబ్బరికాయ కొట్టి పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 29న పున ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎటాక్ చేస్తే ఏం చేయాలి ?

చిన వెంకన్న సన్నిధిలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో బుధవారం ఆక్టోపస్ బలగాలు హడావుడి చేశాయి. ఆలయంలోకి ఉగ్రవాదులు ఆకస్మిక దాడులు చేస్తే ఎలా ఎదుర్కోవాలి..? భక్తులను ఎలా రక్షించాలి ? ఆలయ ఆస్తులను ఎలా కాపాడాలనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అలాంటి పుణ్యక్షేత్రంలో ఉగ్రవాదులు ముప్పేట దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలి? అర్ధరాత్రి లేదా భక్తులు రద్దీగా ఉండే సమయంలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడితే ఎలా తిప్పికొట్టాలనే విషయాలపై అవగాహన కల్పించేందుకు ఆక్టోపస్ బలగాలు ఆలయ ప్రాంగణంలో మాక్ డ్రిల్ చేశాయి. ఆక్టోపస్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు, ఆలయ అధికారులు ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు.





ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం వద్ద బుధవారం రాత్రి ఆక్టోపస్ బృందం చేపట్టిన మాక్ డ్రిల్ దృశ్యాలు

అంగన్‌వాడీల్లో అద్దె కష్టాలు

జిల్లాలో సగానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. జిల్లాలో 1626 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వీటిలో 489 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. కొన్నిటిని పాఠశాలు, కమ్యూనిటీ హాళ్లలో నిర్వహిస్తున్నారు . చాలా కేంద్రాల్లో సౌకర్యాలు , సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు...,



అత్తిలిలో కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సెంటర్



యర్రాయి చెరువులో మహిళా మండలి భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

ఇరగవరం మండలంలో 31 కేంద్రాలు అద్దె గదుల్లోనే..

ఇరగవరం (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలంలో నిర్మించిన అంగన్ వాడీ భవనాలు అసంపూర్తిగా వదిలేయడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని 71 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో సుమారు 31 కేంద్రాలు అద్దె గదుల్లోనే కొన సాగుతున్నాయి. అద్దె భవనాలు ఉన్నచోట అసౌకర్యాల నడుమ విద్యాబోధన సాగుతుంది. ఇరుకు గదులు కావడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని యర్రాయిచెరువు, కంతేరు గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి టీడీపీ హయాంలో ప్రతిపాదనలు చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం మారడంతో భవన నిర్మాణం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రారంభించిన పనులు బేస్‌మెంట్ లెవెల్‌లో వదిలేశారు. అవి పాడైపోతున్నాయని కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అరకొర సౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు

అత్తిలి (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు లేక చిన్నారులు కొట్టుమిట్టాడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలతో పాటు అన్ని వసతులు కలిగిన భవనాలు ఉండాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ జిల్లాలో కొన్నిచోట్ల కమ్యూనిటీ హాల్స్, ప్రార్థనా మందిరాల్లో నిర్వహిస్తున్నారు. అక్కడ సౌకర్యాలు లేక చిన్నారులు ఇబ్బందుల పాలవుతున్నారు. కమ్యూనిటీ హాల్స్, సామాజిక భవనాలు, ప్రార్థనా మందిరాల్లో నిర్వహిస్తున్నప్పటికి ప్రభుత్వ అధికారులు అద్దె నిమిత్తం నిధులు జమ చేయడం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి. ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలి. అత్తిలి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి ఆనుకుని ఉన్న చెరువులో ఇటీవల చిన్నారి పడి మృతి చెందడం అందరినీ కలిసి వేసింది. కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ప్రాజెక్టు అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. కాలువలు, చెరువులు, రహదారుల మూడు రోడ్ల కూడలిలోను అంగన్‌వాడీ కేంద్రాలు లేకుండా చూస్తామని వెంటనే వాటిని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.



చిన్నారి మృతికి కారణమైన చెరువు

పెరిగిన వ్యయం.. భారమైన మెనూ

అత్తిలి (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడంతో కార్యకర్తలకు భారంగా మారింది. పాత ధరల ఆధారంగా బిల్లులు చెల్లిస్తుండడంతో వంట ఖర్చులకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. కేంద్రాల్లో పౌష్టికాహారం ఇచ్చే ధరలను పెంచాలని పలువురు వినతులు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీస్కూలు పిల్లలకు ఆహారం కోసం కూరగాయలు, ఆకుకూరలు, పసుపు, చింతపండు, కారం, పోపు తదితర సామాగ్రి ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని వీటి కొనుగోలుకు ఒక చిన్నారిపై వారానికి రూ.50 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇవి ఏమాత్రం సరిపోవడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు. వారానికి ఒకరికి బియ్యం 75 గ్రాములు, వంట నూనె రూ. 5, కందిపప్పు 15 గ్రాములు, కూరగాయలు, పోపులకు రూపాయిన్నర, గ్యాస్‌కు రోజుకి 50 పైసలు చొప్పున ఇస్తున్నారు. సిలిండర్ రూ. 887 కొనుగోలు చేస్తున్నామని ప్రస్తుతం పెరిగిన ధరలు కారణంగా మెనూ ప్రకారం వండి పెట్టాలంటే అదనపు భారం తప్పడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం దోసకాయపప్పు, మంగళవారం టమాటా పప్పు, బుధవారం ఆకుకూర పప్పు, గురువారం కూరగాయలతో సాంబారు, శుక్రవారం బీరకాయ లేదా సొరకాయ పప్పు, శనివారం వెజిటబుల్ బాత్ రైస్ పెట్టాలి. ఈ మెనూకు 2022 ఫిబ్రవరి ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం వీటి ధరలు మూడు రెట్లు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత బకాయిలు చెల్లించారని కొత్త ధరలు ప్రకారం బిల్లులు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

సొంత భవనాలకే సౌకర్యాలా ?

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు

అద్దె భవనాలకు మొండిచెయ్యి..!

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): పూర్వ పాఠశాల స్థాయి పిల్లలకు పోషకాహారం, ఆట పాటలతో కూడిన విద్యనందించేందుకు ఉద్దేశించిన అంగన్‌వాడీ కేంద్రాలలో ఫర్నీచరు, ఇతర ఆట వస్తువులు సొంత భవనాలకే అందించడంపై అనుమానాలు ఏర్పడుతున్నాయి. ప్రతీ వెయ్యి మంది జనాభాకు ఒక కేంద్రం చొప్పున జిల్లాలో సుమార 1620 అంగన్ వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడం,నిధుల కొరత కారణంగా జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలల్లో ఎక్కువగా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీ, చైల్డ్ టేబుల్, కుర్చీలు, వాటర్ ప్యూరిఫైర్, ఐరన్ ర్యాక్స్, బెడ్ షీట్, బ్లాక్ బోరు వంటి వస్తువులతో పాటు ఆట వస్తువులు, ఇతర అవసరాలకు సంబంధించి మొత్తం 8 రకాల



ఫర్నీచర్, ఆట వస్తువులు

వస్తువులను అందించింది. అయితే వాటిని కేవలం సొంత భవనాలు వున్న అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే అందించడం పట్ల అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారనే భావనతో ఆయా



దువ్వ అంగన్‌వాడీ కేంద్రం

కేంద్రాల పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు అన్ని సౌకర్యాలను సమాన ప్రాతిపదికన అందించాలని కోరుతున్నారు.

సౌకర్యాలు అందరికీ కల్పించాలి



ప్రభుత్వం సౌకర్యాలను అందరికీ అందించాలి. సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించిన పర్నీచరు, అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనం, అద్దె భవనం అనే తారతమ్యం లేకుండా చూడాలి. అద్దె కేంద్రాలలో వుండే పిల్లలకు కూడా అందించాలి.

-బళ్ల చిన వీరభద్రరావు, వేల్పూరు.

489 కేంద్రాలకు అందించాం


జిల్లాలోని మొత్తం 1620 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను సొంత భవ నాలలో నిర్వహిస్తున్న 489 కేంద్రాలకు ప్రీస్కూల్ కిట్లను అందించారు. జిల్లాలో సొంత భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే వీటిని పంపిణీ చేశారు.

-ఎం.శ్రీలక్ష్మీ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, భీమవరం

ముంచెత్తుతున్న కడప ఉల్లి

గూడెం మార్కెట్‌కు ఏడు లారీల్లో రాక

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) తాడేపల్లి గూడెంలో కడప ఉల్లి ముంచెత్తుతోంది. కడప నుంచి ఏడు లారీల్లో సుమారు 110 టన్నుల ఉల్లిని తీసుకొచ్చారు. దీని ధర క్వింటా రూ.650 నుంచి 1200 మధ్య హోల్‌సేల్‌గా పలికింది. కర్నూలు ఉల్లి తగ్గిపోయింది. మరోసారి కర్నూల్లో వర్షాలు రావడంతో అక్కడ ఉల్లి పూర్తిగా పాడైపోవడంతో రైతులు పంట తీయడం మానేసి మేకలతో మేపుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఉల్లి తీస్తే కనీసం కూలీ కూడా గిట్టదనే ఉద్దేశంతో కొంతమంది దున్నేస్తున్నట్లు వ్యాపారులు చెబుతు న్నారు. నష్టపోయిన కర్నూలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేసింది. దీన్ని మార్కెట్లకు తీసుకొస్తే కొనేవాళ్లు లేక పార బోయాల్సి వచ్చింది. ఇటీవల మళ్లీ కర్నూలో భారీ వర్షాలకు పొలాల్లో తీయకుండా వదిలేసిన ఉల్లి మరోసారి మునిగింది. మార్కెట్ పరిస్థితులపై మార్కెటింగ్ శాఖ డీడీ పాపారావు, తాడేపల్లిగూడెం



మార్కెట్ యార్డు సెక్రటరీ గౌస్‌భాషా, సూపర్‌వైజర్లు ఫణికిషోర్, వెంకటేశ్వరరావులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నారు. మహారాష్ట్ర ఉల్లి 150 టన్నులు వచ్చింది. దీన్ని ఆరు లారీల్లో తీసుకొచ్చారు. వీటి ధర నాణ్యత, సైజు ఆధారంగా క్వింటా రూ.1200 నుంచి 1700 మధ్య విక్రయాలు జరిగాయి.

చికెన్ ధరలకు రెక్కలు

స్కిన్‌లెస్ కిలో రూ.260..విత్ స్కిన్ రూ.240

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : చికెన్ ధరలు చుక్కలు చూపుతున్నాయి. గత సంవత్సరం ఇదే సమయంతో పోల్చుకుంటే కిలోకు రూ.80 పెరిగింది. రైతుల దగ్గర కోళ్లు లేకపోవడం ధర పెరగడానికి ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. పండగ సీజన్లో ధర తక్కువగా ఉండటంతో వీటిని తక్కువ సంఖ్యలో పెంచారు. వినియోగం ఎక్కువ.. కోళ్లు తక్కువగా ఉండటంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.260, విత్‌స్కిన్ రూ.240కు విక్రయాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం ఇదే సమయానికి స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.180, విత్‌స్కిన్ రూ.160కు విక్రయించారు.



రైతుల వద్ద కోళ్లు తక్కువగా ఉండడంతో కార్పొరేట్ సంస్థలు ధరను నిర్ణయిస్తున్నాయి. జంగారెడ్డి గూడెం, నల్లజర్ల, కొయ్యలగూడెం, చిన్నతిరుపతి, కామవరపుకోట ప్రాంతాల నుంచి ఎక్కువగా కోళ్లను మార్కెట్‌కు పంపిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో ఇప్పుడు కోళ్లు తక్కువగా ఉన్నాయి. దీంతో ఒక్కసారిగా ధర పెంచారు. రెండు వారాల కిందటి వరకు కిలో స్కిన్‌లెస్ కిలో రూ.220, విత్ స్కిన్ ధర రూ.200 ఉండేది. రెండు వారాల సమయంలో ఏకంగా కిలోకు రూ.40 పెంచేశారు. దీంతో లొట్టలేసుకుని తినే చికెన్ ప్రియులు కిలో పట్టికెళ్లేవారు అరకిలోకు పరిమితమవు తున్నారు. పండగ సీజన్‌లో ధరలు ఇలా ఉంటే పండుగ వెళ్లిన తరువాత ధరలు ఎలా ఉంటాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.



ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న మార్టేరు ఏడీఆర్ సీహెచ్ శ్రీనివాస్, ఉండి కేవీకే శాస్త్రవేత్తల బృందం

మిద్దె తోటలతో ప్రయోజనాలెన్నో

ఉండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిద్దెతోటల పెంపకంతో ఖర్చులు తగ్గడంతో పాటు అదనంగా ఆదాయం పొందవచ్చని మిద్దె తోటలపై అవగాహన పెంచుకోవాలని అవసరం వుందని మార్టేరు ఏడీఆర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్‌ఆర్‌పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మిద్దెతోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ డిబోరా మెషియానా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణాలలో భూమిలేని పరిస్థితుల్లో మొక్కల పెంపకానికి మిద్దెతోటలు ఎంతో ప్రయోజనకరమన్నారు.అవగాహన పెంచుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ కేవీకేలో అందిస్తున్న వివిధ రకాల శిక్షణ, సేవల గురించి వివరించారు. యూని యన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజరు వేణుగోపాల రావు మాట్లాడుతూ తన ఇంటి వద్ద మిద్దెతోటల పెంపకంపై గల అనుభవాలను వివరించారు.ఉండి, భీమవరం, ఆకివీడు, తణుకు ఇతర పరిసర ప్రాంతాల నుంచి మహిళలు విచ్చేశారు.పెదపుల్లేరు యూనియన్ బ్యాంక్ మేనేజరు బి.నీలాద్రిరాజు, కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, డా.బిందుప్రవీణ, డా.వినయ్‌లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పెంచుతున్నా



పండ్ల మొక్కలను పెంచుతున్నాను. ఈ మధ్యే మిద్దెతోటల పెంపకం చేపట్టాను. వీటి వల్ల ఎంతో ఉపయోగం వుంది. మిద్దె తోటలతో ఆదాయం పొందవచ్చు.

కంచర్ల తేజ, భీమవరం

ఖర్చులు ఆదా అవుతాయి



మిద్దెతోటల పెంపకంతో ఖర్చులు ఆదాఅవుతాయి. కొంచెం స్థలం వుంటే చాలు పలురకాల కూరగాయలను పండించవచ్చు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను.

కట్రెడ్డి అనూష, అజ్జమూరు



ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

అక్టోబర్ 11, 12 తేదీల్లో కరాటే పోటీలు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో అక్టోబరు 11, 12 తేదీల్లో ఆల్ ఇండియా షోటోఖాన్ కరాటే ఛాంపియన్‌షిప్ (బడేటి కప్) నిర్వహించనున్నారు. బుధవారం పోటీలకు సంబంధించి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసోసియేషన్‌కు తన సోదరుడు దివంగత బడేటి బుజ్జి గౌరవ అధ్యక్షుడిగా ఉండి కరాటే క్రీడకు వన్నె తీసుకొచ్చారని అన్నారు. ఆయన పేరుతో బడేటి కప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. షాహిన్, డీఎల్ నారాయణ, ఇబ్రహీం బేగ్, అసోసియేషన్ కార్యదర్శి నాగం శివ, ఎస్ సుహాస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే ఎంపిక పోటీలు నిర్వహించారు.



వివిధ పోటీలకు జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులతో వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, పీడీలు

రాష్ట్రస్థాయి పోటీలకు వేల్పూరు విద్యార్థులు

తణుకు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి) :స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో తణుకు రూరల్ మండలం వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణ తెలిపారు. ఈనెల 16వ తేదీన ఏలూరులో జరిగిన జిల్లా జట్ల ఎంపిక పోటీలలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్విమ్మింగ్‌లో అండర్-14 విభాగంలో దినేష్ కార్తీక్, నీరజ్, ఆనందరావు, రాకేష్, కార్తీక్‌లు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా త్వరలో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి జిల్లా జట్టులో పాల్గొంటారని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జట్ల ఎంపిక పోటీల్లో సాహిత్ ప్రియదర్శిని, మోక్షానంద స్వరూప్, సాయి వెంకట వినాయక సాత్విక్ విజేతలుగా నిలిచారని ఈనెల 27, 28, 29 తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శిరీషా, హెచ్‌ఎం రాధాకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు.

పెన్‌డౌన్ దిశగా దస్తావేజు లేఖర్లు

ఆచంట,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2.0 రిజిస్ట్రేసన్ విధానంలో ఆధార్ ఓటీపీ, ఇతర లోప భూయిష్టమైన విధానాల వలన ఓటీపీలు చెప్పేందుకు కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దస్తావేజు లేఖర్లు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఓటీపీ విధానానికి స్వస్తి చెప్పి రిజిస్ట్రేషన్‌లు చేయాలని ఇప్పటికే దస్తావేజు లేఖర్లు ప్రభుత్వం ఒత్తిడి తీసుకు వస్తున్నారు.ఆయా జిల్లాల్లో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలపడానికి సిద్ధపడుతున్నారు. నెల్లూరు జిల్లాలో దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టారు. వారికి మద్దతుగా రాష్ట్రంలో అనేక చోట్ల నిరసన చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 19,20 తేదీల్లో రెండు రోజులు పాటు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఇప్పటికే నరసాపురం దస్తావేజుల సంఘం కమిటీ తీర్మానం చేశారు.కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు పాల్గొనాలని క్రయ విక్రయదారులు కూడా సహకరించాలని కోరుతున్నారు.



ఉండి ఆర్‌అండ్‌బీ బంగ్లాలోని ప్రభుత్వ భూమికి సంబంధించి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టరు నాగరాణి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు

ప్రభుత్వ స్థలాలకు సరిహద్దు రాళ్లు వేయండి

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు నాగరాణి

ఉండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను సర్వే చేసి సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేయించాలని రెవెన్యూ అధికారులకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి సూచించారు. బుధవారం ఉండి ప్రభుత్వ స్థలాలైన ఇరిగేషన్, పీడబ్ల్యుడీ, జడ్పీ స్థలాలను ఆమె పరిశీలించారు. ఉండి ఆక్విడెక్టు వద్దకు విచ్చేసి ఆక్రమణలు తొలగించిన ప్రాంతాలను, రింగ్‌రోడ్ మార్గాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు వుంటే గుర్తించి సంబంధిత యజమానులకు ముందుగా నోటీసులు జారీ చేయాలని అనంతరం తొలగించాలని ఆదేశించారు.ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఉండి తహసీల్దారు నాగార్జున, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఆందోళన బాటలో విద్యుత్ ఉద్యోగులు

భీమవరంటౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర విద్యుత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు బుధవారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 2004 వరకు ఉద్యోగం పొందిన వారికి జీపీఎఫ్ కొనసాగించాలని, జెఎల్‌ఎం గ్రేడ్-2లను పర్మినెంట్ చెయ్యాలని, కరువు భత్యాలను వెంటనే విడుదల చెయ్యాలని నినాదాలు చేశారు. డిమాండ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. జేఏసీ నాయకులు శ్రీకాంత్, చలపతిరావు, శ్రీనివాసరాజు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ శ్రీనివాసరాజు, రాంబాబు, సురేష్ కుటుంబ రావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడికే మెగా లబ్ధి

- నేడు ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ అభ్యర్థులు ఏలూరు చేరిక
- అమరావతి వెళ్లేందుకు 2,292 మందికి వసతి, ప్రయాణ ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు అత్యధికులు ఉద్యోగాలు పొందారు. మెగా డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులకు శుక్రవారం అమరావతి లో సీఎం చంద్రబాబు అందజేయనున్న నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి ఏలూరు నుంచి పంపించేందుకు ప్రయాణ ఏర్పాట్లు, వసతి, తదితర అంశాలపై బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. డీఎస్సీలో ఉమ్మడి జిల్లా నుంచి 1063 మంది అభ్యర్థులు, జోనల్ పోస్టులకు 83 మంది ఎంపికయ్యారని, మొత్తం 1146 మంది అభ్యర్థులతోపాటు, వారికి తోడుగా ఒక్కొక్క సహాయకులను కలిపి మొత్తం 2292 మందిని ఏలూరు నుంచి అమరావతికి తీసుకెళ్లి, తిరిగి తీసుకొచ్చేందుకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఏలూరులో 18వ తేదీ రాత్రి ఆహారం, 19న ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించి తీసుకెళ్లాలన్నారు. ప్రయాణ ఏర్పాట్లకు తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో ఇదంతా జరగాలని సూచించారు. సమావేశంలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, డీపీటీవో ఎస్కే షబ్నమ్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ సాల్మన్‌రాజు, నగరపాలకసంస్థ కమీషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.



వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఆరుగురు అభ్యర్థులకో సూపర్‌వైజర్

ఏలూరులోని 10 పాఠశాలల్లో వీరికి వసతి, ప్రయాణ ఏర్పాట్లు కల్పించడంలో లోటుపాట్లు తలెత్తకుండా విద్యాశాఖ చర్యలను చేపట్టింది. ప్రతీ ఆరుగురు అభ్యర్థులు, వారి సహాయకులకు నిర్ధేశిత వసతులన్నీ అందేలా పర్యవేక్షించేందుకు ఒక సూపర్‌వైజర్ చొప్పున నియమించింది. అభ్యర్థులకు కేటాయించిన పాఠశాలల వివరాలను గురువారం ఉదయమే ఫోన్లలో సమాచారమిస్తారు. వీరంతా తమకు కేటాయించిన పాఠశాలకు వారి సహాయకులతోసహా గురువారం సాయంత్రం 4గంటలకల్లా రిపోర్ట్ చేసి రిజిస్టర్ చేయించుకోవాలి. అభ్యర్థి పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను కౌంటర్‌లో ఇస్తే గుర్తింపు కార్డు ఇస్తారు. పాఠశాల తరగతి గదిలో నిద్రించేందుకు వీలుగా బ్లాంకెట్, తదితర సామగ్రిని తెచ్చుకోవాలని విద్యాశాఖ సూచించింది. ఎవరైనా అభ్యర్థులు రిసీవింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుని, ఐడి కార్డు తీసుకున్న తర్వాత రాత్రి బస చేయడానికి ఆసక్తి కనబరచకపోతే అక్కడి అధికారుల అనుమతి తీసుకుని వెళ్లిపోయేందుకు వెసులుబాటు కల్పించారు. సొంత వసతి ఏర్పాట్లు చేసుకున్న వారంతా 19న ఉదయం 7 గంటలకల్లా రిసీవింగ్ సెంటర్‌లో తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలి. శుక్రవారం ఉదయం 8 గంటలకు అమరావతికి బస్సులు బయలు దేరతాయని, మధ్యాహ్నం 12 గంటలకు అక్కడకు చేరుకుంటాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అమరావతి నుంచి తిరుగు ప్రయాణంలో ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద అభ్యర్థులు దిగిపోవాల్సి వుంటుంది. అక్కడి నుంచి వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు సొంత ఏర్పాట్లు చేసుకోవాలి.

నియోజకవర్గాల వారీగా లబ్ధి

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	మొత్తం
చింతలపూడి	57	93	150
పోలవరం	43	72	115
గోపాలపురం	31	64	95
కొవ్వూరు	43	42	85
నిడదవోలు	20	29	49
దెందులూరు	28	27	55
ఏలూరు	43,	35	78
ఉంగుటూరు	27	23	50
ఆచంట	24	33	57
భీమవరం	26	25	51
నరసాపురం	29	43	72
పాలకొల్లు	39	28	67
తాడేపల్లిగూడెం	42	22	64
తణుకు	20	17	37
ఉండి	16	26	42
అంతర్ జిల్లా	54	25	79
మొత్తం	604	542	1146

పల్లెలు అద్దంలా.. పచ్చదనం వెల్లివిరిసేలా..

- స్వచ్ఛతా ఉత్సవం ప్రారంభం
- 15 రోజుల పాటు కార్యక్రమాలు
- ఉత్తమ పంచాయతీలకు అవార్డులు



స్వచ్ఛ ఉత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పల్లెల్లో పరిశుభ్రత, పచ్చ దనం ప్రతిబింబించేలా ఉండాలన్న సంకల్పంతో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ ఉత్సవ్ పేరుతో మొదలైంది. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమాల నిర్వ హణకు ప్రభుత్వం కార్యాచ రణ రూపొం దించింది. కార్యక్రమానికి అందరినీ సన్నద్ధం చేసేందుకు అవార్డులు అందించనుంది.

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో అపరిశుభ్రం గా ఉండే ప్రాంతాలు, స్థలాలను గుర్తించి వాటిని ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ఈ పోటీల్లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కార్యక్ర మాల్లో ప్రజలు, ముఖ్యంగా యువత ను ఆహ్వానించనున్నారు. అలాగే ఎన్జీవోలను భాగస్వామ్యం చేయడం, అందులో ఉత్తమ సేవలందించిన వారికి కూడా ఈ ఉత్సవం లో అవార్డులు అందించనున్నారు. ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల సిబ్బందిని భాగస్వాములను చేశారు. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఇదీ షెడ్యూల్..

- ఈ నెల 17న స్వచ్ఛ ఉత్సవ్ ప్రచారం, ప్రతిజ్ఞ..
- 18న గృహ వ్యర్థాల విభజన, స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం
- 19న పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరాలు
- 20న పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్‌లు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు
- 21, 22 తేదీల్లో క్లీన్-గ్రీన్ పండగలు, జీరో వేస్ట్ వేడుకలు, మెగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ప్రత్యేక డ్రైవ్
- 23, 24 తేదీల్లో ఓడీఎఫ్+, స్వచ్ఛ సుజల్ గ్రామాల కోసం గ్రామ సభలు
- 25న ఏక్ దిన్, ఏక్ ఘంటా ఏక్ సాద్ పేరుతో ప్రతి వ్యక్తి ఒక రోజు, ఒక గంట శ్రమ దానం చేయాలనే సంకల్పంతో శ్రమదాన కార్యక్రమం
- 26, 27, 28 తేదీల్లో యువత, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల భాగస్వామ్యంతో స్వచ్ఛత క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- 30న స్వచ్ఛత ర్యాలీలు, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలపై జిల్లా స్థాయి సమీక్ష
- అక్టోబర్ 1న గ్రామ సభలు, మోడల్ గ్రామాల ప్రకటన
- 2న స్వచ్ఛభారత్ దివాస్ నిర్వహణ, పారిశుధ్య కార్మికులకు సత్కారం, అవార్డుల అందజేత.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టి యువకుడి మృతి



దెందులూరు,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని మోటా ర్ సైకిల్‌తో ఢీకొట్టడంతో ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలోని పోతునూరు గ్రామానికి చెందిన టైలర్ యడ్ల సింహచలం చిన్న కుమారుడు యడ్ల భరత్ సాయి(22) కాకినాడలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. భరత్ సాయి తన మేనమామ కానిస్టేబుల్ మోటా ర్ సైకిల్ వేసుకుని బుధవారం తాడేపల్లిగూడెంలో బీఫార్మసీ పరీక్షలు రాసి తిరిగి మోటార్ సైకిల్ వస్తుండగా ఉంగ్రాజవరం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో భరత్ సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలాన్ని దెందులూరు ఎస్.ఐ. శివాజీ పరిశీ లించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కాళ్ళ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):కాళ్ల మండలం పెదఅమిరంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పెదఅమిరం గ్రామానికి చెందిన గండి ఆనంద రావు తన భార్య శాంత కుమారి(59) కలిసి మనవడి స్కూల్ ఫీజు కట్టడానికి ద్విచక్ర వాహనంపై భీమవరం వెళ్లారు. గ్రామంలోని వైఎస్‌ఆర్ విగ్రహం సమీపంలో వారిని వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శాంతకుమారి అక్కడికక్కడే మృతి చెందగా ఆనందరావుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆనందరావును దగ్గరలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. విషయం తెలుసుకున్న కాళ్ళ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై మృతురాలి మరిది రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటుకు ముగ్గురు ఆసుపత్రి పాలు

చింతలపూడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయం సమీపంలో గుంపులుగా కుక్కలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. బుధవారం ఉదయం కుక్క కాటుకు ముగ్గురు ఆస్పత్రిపాలయ్యారు. శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆవరణలో విద్యార్థులను కరిచే ప్రయత్నం చేయగా అడ్డుకున్న ఒక వ్యక్తికి చెంపపై కాటు వేసింది. పారిపోయే క్రమంలో ఒక ట్రాక్టర్ డ్రైవర్, ఫౌండరి వెల్డర్‌ల కాళ్లపై కరిచింది. వీరు ముగ్గురు ఆసుపత్రిపాలయ్యారు.

బాలుడి తలపై కత్తిగాట్లు.. ఎవరిపనిది?



ఏలూరు క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏ తల్లి కన్న బిడ్డో తెలి యదు కాని 16వ నెంబర్ జాతీయ రహదారి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో తలపై కత్తి గాయాలతో 12 ఏళ్ల బాలుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. 48 గంటల పాటు అక్కడే పడి ఉండటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. రైతులు బుధవారం సాయంత్రం చూసి హైవే అంబులెన్సుకు సమాచారం ఇవ్వడంతో బుధవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు. ఈ బాలుడు ఎవరో ఏమిటో తెలియదు. బా లుడికి గ్రహణం మొర్రి ఆపరేషన్ జరిగి ఉంది. ఈ ఘటన జరిగి సు మారు 48 గంటలు అవుతుందని అంతా భావిస్తున్నారు. ఆ బాలుడు ఎవరు, ఎందుకు అక్కడికి వెళ్లాడు, ఎవరు అంత దారుణంగా తలపై అన్ని కత్తి గాయాలు వేయాల్సి వచ్చిందనేప్రశ్నలు అంతుపట్టకుండా ఉన్నాయి. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. బాలుడి తలపై గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న ప్రదేశాన్ని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, త్రిటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, పెదవేగి సీఐ రాజశేఖర్‌లు బుధవారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెదపాడు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తాకోడళ్లను బంధించి బంగారం చోరీ

పెనుమంట్ర, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సినీ ఫక్కీలో కత్తులతో అత్తా, కోడళ్లను బెదిరించి చోరీకి పాల్పడిన ఘటన పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లింద్రపర్రులో ఆలస్యంగా వెలుగు చూచింది. బాధితుడు కర్రి బ్రహ్మానంద రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్.ఇల్లింద్రపర్రు గ్రామంలో మంగళవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో మాజీ సర్పంచ్ కర్రి కమల ఇంట్లోకి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఉన్న అత్త, కోడలు చేతులు కట్టేసి కత్తితో బెదిరించి మెడలోని గొలుసులు, బీరువాలోని బంగారం ఆభరణాలు 48 కాసులు, లక్షా 18 వేలు నగదు, రెండు సెల్ ఫోనులు దోచుకుపోయారని అన్నారు. గట్టిగా కేకలు వేసిన చుట్టుపక్కల వారు ఎవ్వరూ రాకపోవడంతో వెళ్లిపోయారని చెప్పారు. పెనుమంట్ర పోలీసులకు బ్రహ్మానంద రెడ్డి ఫిర్యాదు చేయడంతో ఎస్.ఐ. స్వామి దానమ్మ గుడి దగ్గర ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి నర్సాపురం డీఎస్ పి.శ్రీవేద, పెనుగొండ సి.ఐ. రాయుడు విజయ కుమార్, ఎస్ఐ స్వామి పరిశీలించి, డాగ్ స్క్వాడ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. నిందితుల కోసం రెండు బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న డాగ్ స్క్వాడ్

శ్రీగంధం చెట్లు కొట్టేస్తారు..

పగలు పూసలు అమ్ముతున్నట్టు నటిస్తూ రెక్కీ.. మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠా అరెస్టు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పగలు రుద్రాక్షలు, పూసలు అమ్ముతూ రాత్రిళ్ల రైతుల పొలాల్లో అంతర పంటగా వేసుకున్న శ్రీగంధం చెట్లను నరికి స్మగ్లింగ్ చేసే మధ్యప్రదేశ్‌కు చెందిన నలుగురు ముఠాను అరెస్టు చేసినట్టు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రవిచంద్ర వివరాలు వెల్లడించారు. వీరంతా ఊరి చివర గుడారాలు వేసుకుని పూసలు, రుద్రాక్షలు అమ్ముతున్నట్టు నటిస్తూ శ్రీగంధం చెట్లు ఎక్కడ ఉన్నాయో రెక్కీ నిర్వహిస్తూ ఉంటారని తెలిపారు.అనంతరం రాత్రి పూట శ్రీగంధం చెట్లు నరికి అపహరించుకుపోయి స్మగ్లింగ్ చేస్తారని తెలిపారు. నాలుగేళ్లుగా జిల్లాలోని టి.నరసాపురం, తడికలపూడి, చింతలపూడి, కామవరపుకోట, ధర్మాజీగూడెం, ముసునూరు, పెదవేగి మండలాల్లో శ్రీ గంధం చెట్లను దొంగిలించిన 12కేసుల్లో వీరంతా నిందితులని అన్నారు. ఈ నెల 13న కామవరపుకోట మండలం రత్నగిరి గ్రామానికి చెందిన తమ్మినేని సూర్య వరప్రసాద్ అనే రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోటలోకి ప్రవేశించి రైతును బెదిరించి శ్రీగంధం దుంగలతో పాటు, రైతు మెడలో బంగారు గొలుసు అపహరించుకుపోయారన్నారు ఈ ముఠాపై నిఘా పెట్టి బుధవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కటని జిల్లా హర్దువా గ్రామానికి చెందిన ఆదివాసి రాజా, ఆదివాసి ఇలాజ్ కుమార్, ఆదివాసి జెండూ, ఆదివాసి పెన్ కుమార్‌లని తెలిపారు.వీరి నుంచి 30 శ్రీగంధం చెట్ల దుంగలు, రెండు ద్విచక్ర వాహనాలు, ఆయుధాలు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సొత్తు విలువ రూ.ఐదున్నర లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసును దర్యాప్తు జరిపిన సీఐ ఎం.వి. సుభాష్, ఎస్.ఐ. చెన్నారావు, జబీర్, క్రైం పార్టీ ఏఎస్.ఐ. సంపత్, పీసీలు రమేష్, చిట్టిబాబు, షాన్ బాబులకు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ రివార్డులు ఇచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ స్వాధీనం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనగర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న డీజిల్ ట్యాంకర్‌ను అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ట్యాంకర్ డ్రైవరు రాజేంద్ర ప్రసాద్ హైదరాబాద్‌కు చెందిన లారీ యజమాని ఎం.రాధిక వద్ద డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఏలూరు మండల చాటపర్రుకు చెందిన కోనా శ్రీనివాసరావు అనే డీజిల్ వ్యాపారి హైదరాబాదులో ట్యాంకర్‌లో 10 వేల లీటర్ల డీజిల్ నింపి భీమడోలు దగ్గరకు వచ్చి తనకు ఫోన్ చేస్తే ఎక్కడ దింపాలో చెబుతానని డ్రైవరు ప్రసాద్‌కి చెప్పాడు. దీంతో డ్రైవరు ట్యాంకరుతో బయల్దేరి మండలంలో లక్ష్మీనగర్ వద్ద కాళికాంబ అగ్రికల్చర్ సొసైటీ పెట్రోలు బంకువద్ద లారీ నిలిపాడు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం స్టేట్ ట్యాక్సు ఎఫ్‌సీ కమీషనర్ దాడి చేసి ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్యాంకర్‌ను స్థానిక వెంకటదుర్గా ఫిల్లింగ్ హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద భద్రపరిచి సివిల్ సప్లైస్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సివిల్ సప్లైస్ అధికారులు ట్యాంకర్‌ని స్వాధీనం చేసుకుని తనిఖీలు నిర్వహించారు. సివిల్ సప్లైస్ అధికారులు పరిశీలించి 10 వేల లీటర్ల డీజిల్ ఉన్నట్లు నిర్ధారించి ఎటువంటి బిల్లులు, లైసెన్సులు లేకుండా డీజిల్ అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. డీజిల్ విలువ రూ.9.74 లక్షలు ఉంటుందని ఏలూరు ఏఎస్‌వో తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ట్యాంకర్ లారీ



మంత్రి నారాయణకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

గణపవరం మండలాన్ని 'పశ్చిమ'లోనే ఉంచాలి

మంత్రి నారాయణకు అఖిలపక్షం వినతి

గణపవరం/భీమవరం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను అఖిలపక్ష నేతలు కోరారు. బుధవారం రాజమండ్రిలో మంత్రిని గణపవరం మండల అఖిలపక్ష నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. భీమవరం జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందని ఏలూరు అయితే 70 కిలో మీటర్లు ఉండటం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు, గణపవరం మండల తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, జీఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ గొట్టుముక్కల సుధీర్ కుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర నాయకుడు నంద్యాల రామ లింగరాజు, రైతు సంఘం జిల్లా నాయకుడు కూసంపూడి జగపతిరాజు, గణపవరం మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు ముచ్చర్ల వేణు, వైసీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

'అందరికీ న్యాయం'పై పోటీలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యాయ సహాయం ద్వారా అందరికీ న్యాయం అనే అంశంపైన పోటీలు నిర్వహిస్తున్నామని ఆసక్తి కలవారు పాల్గొనవలసిందిగా ఉమ్మడి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి పైన తెలిపిన అంశంపై ఫోటోగ్రఫీ, పెయింటింగ్, స్కెచ్ వీడియోలను తమ పాఠశాల యాజమాన్యం ద్వారా జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనానికి వచ్చే నెల 3వ తేదీలోగా అంద జేయాలని సూచించారు. సామాన్య పౌరులు, సామాజికవేత్తలు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు, వివిధ సంస్థలు పని చేసే అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనవచ్చునని, వీటిని అమరావతిలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు పంపుతామన్నారు.

24న వాహనాలకు వేలం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రవాణా శాఖ సీజ్ చేసిన రవాణా, రవాణేతర వాహనాలకు ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వ హించనున్నట్టు ఉపరవాణా కమీషనర్ షేక్ కరీమ్ బుధవారం తెలిపారు. నూజివీడు ఏపీఎస్ ఆర్టీసీ డిపో, ఎంవీఐ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనరు కార్యాలయంలో చొదిమెళ్ల, ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఏలూరులో వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తామని డీటీసీ తెలిపారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు ధరావత్తుగా రూ.5000 క్యాష్ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని, పూర్తి చిరునామాతో కూడిన ఆధార్ కార్డు నకలును అందజేయాలని అన్నారు.



కునుకుతీశాడంతే.. లారీ బోల్తా

పెనుమంట్ర, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పొలమూరు శివారు బ్రాహ్మణ చెరువు శివారు రోడ్డు పక్కన ఒక లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నుంచి వీరవాసరం వెళ్తున్న లోడు లారీ బోల్తా కొట్టింది. డ్రైవర్‌కు కునుకు రావడంతో సడన్ బ్రేక్ కొట్టగా లారీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

ఎరువుల దుకాణంపై దాడి

ఏలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు బుధవారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. కైకలూరు మండలం ఏటూ జెడ్ ఆక్వా రైతు బజార్, వాసవీ ఆక్వా రైతు బజార్లల్లో తనిఖీ చేయగా, ఏ టూ జెడ్ ఆక్వా రైతు బజార్‌లో లక్షా45వేల260 విలువైన 10.800 టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి వాటిని సీజ్ చేశారు.షాపు యజమానిపై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఏ)కేసులు నమోదు చేసినట్టు విజిలెన్స్ డీఎస్పీ సింగలూరు వెంకటేశ్వరరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల వినతి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జేఏసీ సభ్యుడు ఈడా నరేశ్ మాట్లాడుతూ ఈ నెల 8న సచివాలయ శాఖ డైరెక్టరుకు సచివాలయ ఉద్యోగులంతా సమ్మె నోటీసు అందచేసి తమ సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో సచివాలయ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడాలని ఎమ్మెల్యే కోరారు. సచివాలయ నియోజకవర్గ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీటీడీసీలో బ్యాంకర్ల సంయుక్త కమిటీ సమావేశం

పెదపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని టీటీడీసీలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల స్థాయి బ్యాంకర్ల సంయుక్త కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటుగా లీడ్ బ్యాంక్ మేనేజరు డి.నీలాద్రి, డీఆర్డీఏ పీడీ విజయరాజు పాల్గొని జూన్ 30 నాటికి వార్షిక క్రెడిట్ ప్లాన్ అమలు, వ్యవసాయ మరియు ఇతర ప్రాధాన్యతా రంగ రుణాల కింద పనితీరుపై సమీక్షించారు. కౌలురైతులకు, సీసీఆర్సీ కార్డుదారులకు రుణాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

దాతలు ముందుకు రావాలి : ఎమ్మెల్యే చంటి



ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): దాతలు ముందుకు వచ్చి సమాజ సేవకు తోడ్పడాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సత్రంపాడు హిందూ స్మశానవాటికలో ఎన్.అంజయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సీతామహాలక్ష్మి నూతన శాంతిరథాలు, ఫ్రీజర్‌బాక్సులను విరాళంగా అందజేశారు. వీటిని ఎమ్మెల్యే బడేటి చంటి దాతలతో కలిసి ప్రారంభించారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, అట్లూరి రామకృష్ణ, మాజీ సర్పంచ్ నిర్మలకుమారి, మానవత సభ్యులు నేతర అజయ్‌బాబు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన



మాట్లాడుతున్న బాబ్జీ, పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ కల్పనకు అవకాశం ఉంటుందని పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ జోనల్ మేనేజర్, డిప్యూటీ కలెక్టర్ కె.బాబ్జీ అన్నారు. బుధవారం మండలంలోని సోమవరప్పాడులో ఏలూరు ఆర్డీవో అంబరీష్ అచ్యుత్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎమ్మెల్యే ప్రభాకర్ పాల్గొని గ్రామస్థులు, రైతులకు అవగహన కలిగించారు. సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు నాని, టీడీపీ మండలాధ్యక్షుడు మిల్లుబాబు, మోతు కూరి నాని, గారపాటి కొండయ్య చౌదరి, తహసీల్దార్ సుమతి పాల్గొన్నారు.

● పెదపాడు: వట్లూరులో రూ.ఐదు కోట్ల వ్యయంతో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసే ప్రాంతాన్ని రైల్వే ఉన్నతాధికారులు, స్థానికులతో కలిసి బుధవారం పరిశీలించారు. వట్లూరు సొసైటీ అధ్యక్షుడు కొమ్మన లక్ష్మణమోహన్, తహసీల్దారు కృష్ణజ్యోతి, కొమ్మన వెంకటశ్రీధర్, ముళ్ళపూడి సాంబశివరావు, ఉప్పలపాటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

సీఆర్టీలను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యేకు వినతి



బుట్టాయగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు (సీఆర్‌టీ)ను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్రి బాల రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు కలుము వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో 13 ఏళ్లుగా అనేక మంది సీఆర్టీలుగా పనిచేస్తున్నారని అన్నారు. నాయకులు కంగాల గోపాలకృష్ణ, తెల్లం రమేష్, కుంజా వెంకటేశ్వరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ అవసరాలపై ప్రణాళిక సిద్ధం చేయాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆది కర్మయోగి ప్రాజెక్టులో ఎంపికైన గ్రామాల్లో అవసరాలపై ప్రణాళికలను సిద్ధం చేయాలని కర్మయోగి ప్రాజెక్టు ఆఫీసర్ రిషబ్ చతుర్వేది తెలిపారు. బుధవారం జైనవారిగూడెంలో జరిగిన ఆది కర్మయోగి కార్యక్రమంలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ టి.లత, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఎవో శిరమయ్య, ఏపీడీ రాజబాబు, సర్పంచ్ టి.సీత, సూపర్‌వైజర్ ఝాన్సీ కార్యదర్శి కిరణ్‌కుమార్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులంతా సేవాస్ఫూర్తితో పనిచేయాలి : రోషన్

కామవరపుకోట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్టు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మం డల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరికీ వర్తింప చేస్తున్నామన్నారు. జడ్పీటీసీ కడిమి రమేశ్, తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి, ఎంఈవో సుబ్బారావు, ఏవో ముత్యాలరావు, ఏపీవో మల్లేశ్వరరావు, ఏఈ ఆశిక్, శ్యాంసుందర్, సివిల్ సప్లయీస్ డీటీ శేషగిరి పాల్గొన్నారు. సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలపై వినతి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీచర్ల అంతర్‌జిల్లా బదిలీలను రిక్వెస్టు ప్రాతిపదికపై వర్తింపజేయాలని ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పంపిన లేఖ ప్రతులను బుధవారం మీడియాకు విడుదల చేశారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో దంపతుల్లో ఒకరు ఉపాధ్యాయ వృత్తిలో ఉండగా, మరొకరు వేరే ప్రాంతాల్లో ఉంటున్నారని వివరించారు. ఇలా వేర్వేరు జిల్లాల్లో ఉండటంతో కుటుంబ పరంగాను, పిల్లల సంరక్షణ పరంగాను సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అంతర్ జిల్లా బదిలీలను స్పౌజ్, మ్యూచువల్ కేటగిరీ టీచర్లకు మాత్రమే వర్తింపజేశారని, ఇంకా మిగిలిన వారికి కూడా అనుమతించాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. దీని వల్ల 10-15 ఏళ్లుగా వివిధ జిల్లాల్లో కుటుంబాలకు దూరంగా పని చేస్తున్న టీచర్లకు న్యాయం జరుగుతుందన్నారు.

మూడు సొసైటీల్లో త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం



సరిపల్లిని అభినందిస్తున్న నాయకులు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో జీలుగుమిల్లి, దర్బ గూడెం, ములగలంపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా పీఏసీఎస్ కార్యాలయాల్లో సెక్రటరీల ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకార నిర్వహించారు. జీలుగుమిల్లి సొసైటీ ఛైర్మన్‌గా సరిపల్లి సత్యనారాయణరాజు, సభ్యులు వనమ వెంకటేశ్వరావు, వెలగల అజయ్ దర్భగూడెం సొసైటీ ఛైర్మన్‌గా అక్కిశెట్టి విజయ్‌ప్రసాద్, కోనేటి హనుమంతరావు, సింగులూరి రామారావు, ములగలంపల్లి సొసైటీ ఛైర్మన్‌గా గంగిరెడ్ల రాఘవయ్య, సభ్యులు అకిరెడ్డి ప్రభాకర్, పిన్నమని శ్రీను కూటమి నాయకులు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పసుపులేటి రాము, మాజీ జడ్పీటీసీ బాసిన రాజబాబు, ఇన్‌చార్జి సెక్రటరీ జ్యోతి ఉన్నారు.

లస్కర్ల కొరత

(5వ పేజీ తరువాయి)

రెగ్యులర్ లస్కర్లు 38 మంది ఉన్నారు. అవుట్ సోర్సింగ్ కింద కనీసం 300 లస్కర్ పోస్టులను మంజూరు చేయాలని కోరుతుంటే కేవలం 190 పోస్టులను అవుట్ సోర్సింగ్ పోస్టులతోనే సరిపెడుతున్నారు. వాస్తవంగా 12 నెలలకు విధుల్లోకి తీసుకుని కేవలం పది నెలలకే రూ.10,300 వేతనం ఇస్తున్నారు. ఈ వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలని, 12 నెలలు కాలానికి నియా మకం చేయాలని కోరుతున్న జల వనరుల శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఆప్కాస్ కింద వీరి నియామకం చేయాలని కోరుతున్న పదేళ్ల నుంచి అరకొర సిబ్బందే సాగునీటి కాల్వల నిర్వహణ చేపట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా మెయిన్ ఇరిగేషన్ పరిధిలో మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల 20మంది కనీసంగా పనిచేయాల్సి ఉంది. ఎర్రకాల్వ, జల్లేరు, తమ్మిలేరు కొవ్వాడ కాల్వల కిందిస్థాయి రెగ్యులర్ సిబ్బంది అడపాదడపా లాకుల నిర్వహణ చేస్తున్నారు. నిమ్మల రామానాయుడు ఈ శాఖ మంత్రిగా ఉన్న నేపథ్యంలో లస్కర్ల సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పేదింటికి వరం!

(5వ పేజీ తరువాయి)

ప్రకటించిన రూ.2.50 లక్షల రాయితీ వర్తిస్తుంది. ఇంకా జిల్లాలో సొంతింటి స్థలం ఉన్న లబ్ధిదారులు ఈ పథకం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. తగిన ఆధారాలు అంటే ఆధార్ కార్డు, కుల, ఆదాయ, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు/ ల్యాండ్ పొజిషన్ సర్టిఫికేట్ పత్రాలు అందజేసి దరఖాస్తు చేసుకోవాలి.

ఇళ్ల నిర్మాణంలో మూడోస్థానం : ఈ ఏడాది జిల్లాలో పీఎంఏవై అర్బన్/ పీఎంఏవై గ్రామీణ్‌లో 12,345 గృహాలు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దే శించుకోగా ఇప్పటి వరకు 12,022 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఏలూరు జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

వైద్య సేవలు వినియోగించుకోండి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):స్వస్త్ నారి-సశక్త్ పరివార్ అభియాన్‌ను మహిళలు వినియోగించుకోవాలని ఎంపీ మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. సమాజం, దేశం పురోగతి సాధించాలంటే మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. మహిళల కోసం ఆరోగ్యవంతమైన మహిళా, సాధికార కుటుంబం అనేక కార్యక్రమం ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా బుధవారం ప్రారంభించారన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దీంతో పాటు తల్లిబిడ్డ తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ప్రధాని మోదీకి ఎంపీ పుట్టామహేశ్ కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● పెదవేగి: ఏలూరు ఆశ్రం ఆస్పత్రి సహకారంతో పెదవేగి సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ పర్యవేక్షణలో సొసైటీలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సొసైటీ ఆధ్వర్యంలో రోగులకు అవసరమైన మందులు, కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తామన్నారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి ఆర్వీ ప్రసాద్, టీడీపీ నాయకులు కంచెన మోహనరావు, వీరవల్లి సత్యనారాయణ, యశ్వంత్, కిషోర్ పాల్గొన్నారు.

స్వస్త్ నారి-సశక్త్ పరివార్‌లో వక్తలు

● చింతలపూడి: మండలంలోని రేచర్ల, పాత చింతలపూడి సచివాలయాల పరిధిలో 350 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సేవలు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ కె.నరేశ్, డాక్టర్ గీత వీరికి పరీక్షలు నిర్వహించారు.రేచర్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కామేశ్వరి, ఎంపీపీ బి.రాంబాబు, కూటమి నాయకులు కంచర్ల శ్రీనివాస్, తాటిపర్తి శ్రీనివాసరావు, పుసునూరి సుబ్బారావు, సర్పంచ్ శివరామకృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● పెదపాడు: అప్పనవీడులో వట్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, సీహెచ్‌వో కృష్ణారావు పాల్గొన్నారు.

● దెందులూరు: గోపన్నపాలెం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు) ప్రధాన వైద్యులు డాక్టర్ రాకేష్‌లతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. యువత నియోజకవర్గ అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు, టీడీపీ గ్రామాధ్యక్షుడు చింతా సుబ్బారావు,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ కృష్ణమోహన్, మారగాని సత్యనారాయణ, కేబుల్ శ్రీను, బజారు గణేష్ బొర్రా చందు, భవాని ప్రసాద్, గారపాటి కొండయ్య చౌదరి ఉన్నారు.

● లింగపాలెం: మండలంలోని లింగపాలెం పీహెచ్‌సీ, యడవల్లి గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ప్రారంభించారు. గర్భిణులు, బాలికలు, విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రాజశేఖర్, నైమీషా, జ్యోత్స్న, హరీష్‌రావు, నాగుల్‌మీరా, వెంకటరెడ్డి, అర్జున్ రావు, పద్మజ సేవలందించారు. ఎమ్మెల్యే రోషన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.



పెదవేగిలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



పోలవరంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు



బుట్టాయగూడెంలో జెండా ఆవిష్కరించిన నాయకులు

ఘనంగా మోదీ పుట్టిన రోజు వేడుకలు

ఏలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో భారత్ రాబోయే రోజుల్లో ప్రపంచానికి దిక్సూచిగా మారబోతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ(తపన) అన్నారు. నగరంలో ఏలూరులోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రధాన మోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గారపాటి చౌదరీ రక్తదానం చేసిన వారికి పళ్లు, సర్టిఫికెట్లను అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపాటి సత్యనారాయణ, గాది రాంబాబు, ఉపాధ్యక్షులు నెరుసు బాలరాజు, సీనియర్ నాయకురాలు శరణాల మాలతీరాణి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కట్నేని కృష్ణప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు అదపాక నాగసురేశ్ పాల్గొన్నారు.

● ఏలూరురూరల్: ప్రధాని మోదీ పుట్టిన రోజు వేడుకలను ఏలూరు జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, సినీ నటుడు మెల్లేటి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయంలో బుధవారం సాయంత్రం వృద్ధులకు చీరలు, జాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఏలూరు టౌన్ అధ్యక్షుడు అరిసెల విజయ సాయి బాబు, అంబటి శ్రీనివాస్, సింగవరపు వెంకటేశ్వరరావు, కెల్ల సత్యనారాయణ, టి.వెంకటరమణ,దేవగళ్ల సత్తిబాబు, ఎం.నాగేశ్వరరావు, వసారి సత్తిబాబు, సిహెచ్ కనకరాజు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలంలో విజయ గణపతి, ఉమా సహిత ఉమామహేశ్వర స్వామివారి ఆలయాల్లో మోదీ పేరున ఏకవార రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు.బుట్టాయగూడెంలో బీజేపీ జెండా ఆవిష్కరించి జన్మదిన వేడుకలను నిర్వహించి అందరికి మిఠాయిలను పంచారు. నాయకులు దొమ్మేటి లక్ష్మీ జనార్దనరావు, కరాటం ఉమామహేశ్వరరావు, పులపర్తి స్వరాజ్యలక్ష్మీ, వంకా కాంచనమాల, దెయ్యాల సీతారామాంజనేయులు, యు.నాగరాజు, కొండపల్లి వీర్రాజు, కె.రామకృష్ణ, కోసూరి సురేశ్ పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలో మోదీ పుట్టిన రోజు సందర్భంగా కూటమి నాయకులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన గరిమళ్ల చలపతిరావు మాట్లాడుతూ దేశంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

● పెదవేగి: విజయరాయిలో బుధవారం టీడీపీ, జనసేన నాయకులు కేక్‌కట్ చేసి మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్వదేశీ వస్తువులు వినియోగించాలంటూ ప్రదర్శించారు. జనసేన నాయకుడు మేడిచర్ల కృష్ణ మాట్లాడుతూ ప్రధానిగా మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం వికసిత్ భారత్ దిశగా వేగంగా అడుగులు వేస్తోందన్నారు. టీడీపీ బీసీసెల్ నాయకుడు బిర్లంగి పెద్దులు, టీడీపీ, జనసేన నాయకులు గుణ్ణం బాలు, కలిదిండి సురేష్, బమ్మిడి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం : ప్రధాని మోదీ పుట్టిన రోజును బుధవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయంలో మోదీ గోత్రనామాలతో అర్చనలు అభిషేకాలు పూజలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో, వృద్ధాశ్రమంలో పాలు, పండ్లు, రొట్టెలు అందజేశారు. పాతపోలవరంలో ఎంపీటీసీ అనిత స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ నేతలు బొరగం వెంకటలక్ష్మి, కరిబండి నాగరాజు, దత్తిదేవి, నాగరాజు, ఎంపీటీసీ సోమరౌతు అనితకుమారి, గంటా శ్రీను పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల

వ్యాస రచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నిడమర్రు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన వారధి వ్యాసరచన పోటీల్లో పత్తేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లిఖార్జున రావు మాట్లాడుతూ తమ విద్యార్థులు కె.రిషిత, కె. మహిమ సువర్ణరూప, చొక్కాకుల దీవెనలు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.బుధవారం ఉంగుటూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును గౌరవ సూచికంగా కలవగా ఆయన అభినందించారు.ఎంఈవోలు అనూరాధ, శేషగిరిరావు, కొచ్చర్లపాటి సుబ్బరాజు, హెచ్ఎం మల్లిఖార్జునరావు, సర్పంచ్ సాయిప్రియ, ఉప సర్పంచ్ రుద్రరాజు కొండయ్యరాజు ఉన్నారు.

పరిహారం చెల్లించాలి

కుక్కునూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):గతంలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి పరిహారం అందించాలని అఖిల భారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.గౌస్ అన్నారు. బుధవారం ప్రజాపంథ పార్టీ కార్యా లయంలో సమావేశం నిర్వహించారు. నాయకులు ఎస్.రామారావు, కే.కల్లయ్య, వే.బుచ్చయ్య, వీరబాబు పాల్గొన్నారు.

విశ్వకర్మ మహర్షి స్ఫూర్తిదాయకం

● జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జడ్పీ కార్యాలయంలో బుధవారం విశ్వకర్మ జయంతి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ విశ్వకర్మ భగవాన్‌ను శిల్పులు సృజనాత్మకతకు ప్రతీకగా పూజింపబడతారన్నారు. జిల్లా అభివృద్ధిలో కార్మికులు,శిల్పులు, వృత్తిదారుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. జిల్లా పరిషత్ సిఈఓ ఎం శ్రీహరి, డిప్యూటి సిఈఓ కె భీమేశ్వర్, కార్పొరేటర్ సాంబశివరావు, ఎల్ గోపాలాచారి, జిల్లా పరిషత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గెజిటెడ్ హోదా ఇవ్వాలి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో, నగర పాలక సంస్థల్లో పని చేస్తున్న సూపరింటెండెంట్స్ ఆ పై కేటగిరి ఉద్యోగులకు గెజిటెడ్ హోదా ఇవ్వాలని ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ మినిస్ట్రియల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు విజయభాస్కర్ కోరారు.

అందుబాటులో ఎరువులు : శివమణి



పెదవేగి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యమని సొసైటీ ఛైర్మన్ కొనకళ్ల శివమణి అన్నారు. పెదవేగి మండలం ముండూరు సొ సైటీలో అందుబాటులో ఉన్న ఎరువుల విక్రయాలను సొసైటీ కార్యదర్శి బీవీఎస్వీ ప్రసాద్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. శివమణి మాట్లాడుతూ అవసరమైన ఎరువులు సొసైటీలో అందుబాటులో ఉన్నాయన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలతో పంటల సీజనును దృష్టిలో పెట్టుకుని ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు.

శీతల పానీయాల పరిశ్రమ విజిట్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా బుధవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల యూజీ, పీజీ కోర్సుల విద్యార్థినుల బృందం గోపాలపురం మండలం, కన్నాపురంలోని శీతల పానీయాల తయారీ కంపెనీని సందర్శించారు. తయారీవిధానాలను విద్యార్థినులు ప్రత్యక్షంగా పరిశీలించారని కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జ్యోతిర్మయి తెలిపారు. కర్మాగారం విస్తరణ పనులు, భవిష్యత్ ప్రణాళికలు, వ్యూహాలపై సంస్థ ప్రతినిధులు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి పాల్గొన్నారు.



ఆప్కాబ్ చైర్మన్ గన్నికి సత్కారం

నిడమర్రు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి):ఆప్కాబ్‌ను జాతీయ స్థాయిలో ఉత్తమ పనితీరు పురస్కారంతో నిలబెట్టిన ఛైర్మెన్ గన్ని వీరాంజనేయులును నిడమర్రు టీడీపీ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం క్రొవ్విడిలో మండల నాయకులు గన్నిని ఘనంగా సత్కరించారు. గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఆప్కాబ్ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పార్టీ మండలాధ్యక్షులు ఏఎల్ డీపీ డైరెక్టర్ ముత్యాల స్వామి, ఆక్వా కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ మాజీద్, ఎన్ఆర్ఐ ఎండీ సాజిద్, సారికె లెనిన్ బాబు, సత్తినీడి నాని, పైడికొండల శివాజీ పాల్గొన్నారు.

వైసీపీ కోఆప్షన్ సభ్యుడు టీడీపీలో చేరిక

వైసీపీకి చెందిన మైనారిటీ నాయకుడు నిడమర్రు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ సత్తార్ టీడీలో చేరారు. క్రొవ్విడిలో గన్ని వీరాంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు.



రహదారిని ప్రారంభిస్తున్న పద్మశ్రీ, రోషన్ కుమార్

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : జడ్పీ చైర్ పర్సన్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను పద్మశ్రీ, ఎమ్మెల్యే రోషన్ కుమార్ సంయుక్తంగా ప్రారంభించారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి మేకా ఈశ్వరయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పట్టణ మండల, అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్,సాయిల సత్యనారాయణ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఎంపీడీవో శ్రీదేవి దంపతులకు సన్మానం

దెందులూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కంతేటి శ్రీదేవిని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. 14 ఏళ్ల పాటు మండలంలో సమస్యల పరిష్కారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మండలాన్ని ముందుకు నడిపిన ఎంపీడీవో కంతేటి శ్రీదేవి పదోన్నతి పొందడం ఆనందంగా ఉందని దెందులూరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి, తహసీల్దార్ సుమతి, మండల స్థాయి అధికారులు పేర్కొన్నారు. బుధవారం దెందులూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏలూరు డ్వామా ఫైనాన్స్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన శ్రీదేవి, శ్రీనివాస్ దంపతులను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇన్‌చార్జి ఎంపీడీవో భీమరాజు, ఉపాధి ఏపీవో ఫాతిమా ప్రసన్న, అన్ని మండల శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. బ్యాంక్ అధ్యక్షులు బోడేటి మోహన్‌బాబు, ఇప్పిలి వెంకటేశ్వరరావు, పెనుబోయిన మహేశ్ యాదవ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు పి ఆదిలక్ష్మి, గిరిజారాణి, స్టానిష్ బాబు, ఆనంద్, సురేశ్ ఉన్నారు.



నూతన మోటార్ సైకిల్ ఆవిష్కరిస్తున్న ఎస్.ఐ.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఎస్.ఐ. చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు స్థానిక హోండా షోరూంలో నూతనంగా పెట్టిన మోటార్ సైకిల్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపే క్రమంలో జాగ్రత్తలు వహించకపోవడంతో అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, ప్రతీ ఒక్కరూ నిబంధనలు పాటించి హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు శిక్షణ ఇచ్చారు. అలాగే తేజ హోండా షోరూం ఎండీ ఉద్దండం శ్రీహర్ష మాట్లాడుతూ ఈ మోటార్ సైకిల్ నూతనంగా ఆవిష్కరించామని ఎక్కువ మైలేజ్, తక్కువ ధరకే వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. పలువురు వాహన చోదకులు, నాయకులు పాల్గొన్నారు.



మలబార్‌లో మైన్ వజ్రాభరణాల ప్రదర్శన

ఏలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అతి పెద్ద జ్యూవెలరీ సంస్థలో ఒకటైన మలబార్ గోల్డ్, డైమండ్స్ ఏలూరు షోరూంలో "మైన్ డైమండ్స్" షోని బుధవారం ప్రారంభించింది. పలువురు అతివల చేతుల మీదుగా వజ్రాభరణాల ప్రదర్శనను ఆవిష్కరించారు. ఈసందర్భంగా షోరూం మేనేజర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏలూరు షోరూంలో 17 నుంచి 22వ తేదీ వరకు డైమండ్ షో ఉంటుందన్నారు. బైబ్యాక్ గ్యారంటీ, బలబార్ గోల్డ్ ప్రత్యేకత అన్నారు. ఏజీఎం రాములు, ఆమీన్, మార్కెటింగ్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి స్వామికి అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో భాద్రపదమాసంలోని బుధవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించారు. ఆలయ ఈవో సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

ఎంపీడీవోగా దయా సాగర్



ఏలూరురూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీడీవోగా దయా సాగర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల ఎంపీడీవోగా పనిచేసిన దయసాగర్‌ను ఏలూరుకు నియమించారు. ఇక్కడ పనిచేసిన వెన్నా శ్రీలత పశ్చిమ గోదావరి జిల్లా డ్వామా ఏవోగా బదిలీ చేశారు. దయాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు ఎంపీడీవోను కలిసి అభినందనలు తెలిపారు.

పోలవరం ఎంపీడీవోగా మణికుమారి



పోలవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎంపీడీవోగా బుధవారం జి.మణికుమారి బాధ్యతలు స్వీకరించారు. టి.నర్సాపురం ఏవోగా పని చేసిన ఆమె ఉద్యోగోన్నతిపై పోలవరం రాగా పోలవరంలో ఇప్పటి వరకూ ఇంచార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన చెరుకూరి శ్రీనివాస్‌బాబు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి చార్జి అప్పగించారు.

బాధితులకు గన్ని పరామర్శ

కామవరపుకోట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆడమిల్లి పంచాయతీ నూతనం గ్రామానికి చెందిన కాసన్నేని వెంకటేశ్వరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, సర్పంచ్ గూడపాటి కేశవరావు, కామవరపుకోట సొసైటీ చైర్మన్ ఘంటా మాధవరావు, తడికలపూడి సొసైటీ చైర్మన్ తూతా బాలాజీకుమార్,టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు జిజ్జూరి బాబ్జి, కరిపోతు కృష్ణ, ఘంటా సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసమే వైద్య శిబిరాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు విక్రమ్ కిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్రమ్‌కిషోర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని మహిళలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కుక్కునూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లై హమాలీలు, డీసీసీ హమాలీలకు దసరా బోనస్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కుక్కునూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరుకుల పంపిణీల కోసం పని చేస్తున్న హమాలీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. హమాలీలు కే.తిరుపతయ్య, టి. సురేశ్, ఎస్.సాయిరామ్, ఎం.చందు, ఎం.లక్ష్మణ్, ఎం.రామ్ చరణ్ పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

లింగపాలెం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ నైమీషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మి అన్నారు. లింగపాలెంలో 8వ పౌష్టికాహార మహోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు,గర్భిణులకు, బాలింతలకు, పౌష్టికాహారం అందిస్తుందన్నారు. రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు లీలాకుమారి, సుజాత, సునీత పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి హుండీల ఆదాయం రూ.9,72,360లు లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆలయంలో ఎండోమెంట్ తనిఖీ అధికారులు, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కింపు చేశారు. 83 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో రెవెన్యూ, గ్రామస్థులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆటల పోటీలు

ముసునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీ పాఠశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం డి.శైలజ తెలిపారు. బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ ఆటలతోపాటు వ్యాయామ క్రీడలను నిర్వహించనున్నట్లు అండర్-14, అండర్ -17 విభాగాల్లో పోటీలు జరుగుతాయని మండల కో-ఆర్డినేటర్ హేమాదేవి తెలిపారు.

రహదార్ల సమస్యలు పరిష్కరిస్తాం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన మంత్రి పార్థసారథి
- గ్రామాల్లో పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నూజివీడు/ముసునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, మొగలిచెరువు నీరువల్ల మచిలీపట్నం - కల్లూరు (ఎంఅండ్‌కె) రోడ్డు ధ్వంసమవుతోందని 'వానొస్తే ఇంతే' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. బుధవారం నూజివీడు వచ్చిన ఆయన పట్టణంలోని జలమయమైన పల్లపు ప్రాంతాలను, ఎంఅండ్‌కే రహదారిని పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ రహదారి ఎత్తు పెంచడంతో పాటు రెండు కల్వర్టులు కూడా నిర్మించి నీటిని పోతురెడ్డిపల్లి రోడ్డులోని వాగులోకి మళ్లించటం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆయన అధికారులకు సూచించారు. అంచనాలు తయారు చేయమని నిధులు మంజూరు గురించి తాను చూస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఆయన పట్టణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటమునిగిన ఎన్టీఆర్‌కాలనీ, బాపూనగర్, మొగలిచెరువు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వార్డుల్లో ప్రజలు మంత్రిని కలిసి వారి సమస్యలు వివరించగా పరిష్కరిస్తామని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. చెక్కపల్లి గ్రామానికి చెందిన షేక్ అక్తరున్నీసాకు వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 2 లక్షల ఎల్‌వోసీ చెక్కును బుధవారం మంత్రి అందజేశారు. నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన బి.నీరజ గత రెండురోజుల క్రితం వరద ప్రమాదంలో మృతి చెందింది. బుధవారం మంత్రి పార్థసారథి తుక్కులూరు వెళ్ళి ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ.15వేలు సొంత నగదును అందించారు. నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామంలో రూ.2.54 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి పార్థసారథి బుధవారం శంకుస్థాపన చేశారు.

బూరుగూడెం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



చాట్రాయి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బూరుగుగూడెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా వెల్లంకి రాంబాబు (జనసేన), సభ్యులుగా టీడీపీకి చెందిన కాలసాని సూర్యనారాయణ, తేళ్ళూరి శేఖర్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కూటమి నాయకులు బసవారెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, తుమ్మల రామ్మోహనరావు, కట్టా దుర్గారావు, తుమ్మల జగన్ తదితరులు పాల్గొన్నారు.



బూరుగుగూడెంలో పతాకాన్ని ఆవిష్కరించిన విశ్వబ్రాహ్మణులు

ప్రపంచ సృష్టికర్త విశ్వకర్మ

చాట్రాయి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణుడి కోసం ద్వారకా నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థాన్ని నిర్మించిన విశ్వకర్మ ప్రపంచ సృష్టికర్త అని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని చాట్రాయి, బూరుగుగూడెం గ్రామాల్లో విశ్వకర్మ జయంతిని మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మకు పూజలు నిర్వహించి, పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ స్వయంభూగా అవతరించారని, దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలు తయారు చేసి ఇచ్చి, దివ్య వడ్రంగిగా ఖ్యాతి పొందారని అన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


చేతివృత్తుల వారి సంక్షేమానికి పెద్దపీట : కామినేని

కైకలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా కైకలూరు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవాన్ చరిత్రను వివరించారు. మోడీ పుట్టినరోజు సందర్భంగా కైకలూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు, సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, బీఎంఎస్ నాయకుడు యానాల బసవయ్య, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు.. ఎరువులు సీజ్

కైకలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులను ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ ఏడీఏ ఎ. పార్వతి అన్నారు. బుధవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు కైకలూరులోని ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఏటుజెడ్ ఆక్వాబజారులో రూ.1,45,260 విలువ కలిగిన ఎరువుల వ్యత్యాసాలను గుర్తించి వాటిని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఏవో జి వీరయ్య, విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్, వ్యవసాయశాఖ ఏవో ఆర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ విజేతకు కామినేని అభినందన



శ్రీ నాగతేజను అభినందిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ముదినేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించి ఒకేసారి 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం రాష్ట్ర చరిత్రలోనే కాక దేశ చరిత్రలో కూడా ప్రథమమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. డీఎస్సీలో ప్రతిభ కనబర్చిన తొలి ప్రయత్నంలోనే లెక్కల సబ్జెక్టులో 86 మార్కులు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికైన ముదినేపల్లి మండలం గురజ గ్రామానికి చెందిన ఐలూరి శ్రీనాగ తేజను బుధవారం ముదినేపల్లిలో పీఎం మోదీ జన్మదిన వేడుకల వేదికపై కామినేని సత్కరించి అభినందించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర	రూ.475

ఇదేనా ఆదర్శం

రంగాపురం మోడల్ ప్రైమరీ పాఠశాల చుట్టూ ముళ్లపొదలు

ముదినేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో ఆదర్శ (మోడల్) ప్రాథమిక పాఠశాలగా మారిన ముదినేపల్లి మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల రూపు మారలేదు. అది పాఠశాలా లేక చిట్టడవిలో చిన్న ఇల్లా అన్నట్లుగా ఉంది. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం ప్రహరీ గోడ పక్కనే లోతైన మురుగు కాల్వతో అధ్వానంగా ఉంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పాఠశాల ప్రహరీ గోడకు సమీపంలో రోడ్డు నిర్మాణం జరిగింది. అది పూర్తి కాకపోవటంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ఆవరణలోకి వెళ్లేందుకు కూడా చిన్నపాటి రోడ్డు ఉండటం మరింత ప్రమాదకరంగా ఉంది. ప్రహరీ గోడ ఎదుట ముళ్ల పొదలు, చెట్లు పెరిగి పాఠశాలకు వెళ్లే రహదారిని మూసేశాయి. వర్షం కురిస్తే పాఠశాల ఎదురుగా ఉన్న డ్రెయిన్‌లో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. అయినా పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. ఇక విద్యార్థులు కోతుల బెడద ఎదుర్కొంటున్నారు. భోజనం సమయంలో కోతులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పరిసరాలను బాగు చేసి ఈ పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.



పాఠశాల వద్ద పెరిగిన ముళ్ల పొదలు, మొక్కలు



కైకలూరులో ప్రధాని మోదీ చిత్రపటానికి ఎమ్మెల్యే కామినేని పాలాభిషేకం



ఆగిరిపల్లిలో ప్రధాని చిత్రపటానికి మంత్రి పార్థసారథి పాలాభిషేకం

దేశాన్ని అగ్రగామిగా నిలిపే సత్తా మోదీకే ఉంది

కైకలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రగామిగా నిలిపే సత్తా ప్రధాని మోదీకే ఉందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం ప్రధాని పుట్టినరోజు సందర్భంగా కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అభిమానుల మధ్యన భారీ కేక్ కట్ చేసి నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 75 సంవత్సరాల వయస్సులో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు మోదీ శ్రమిస్తున్నారన్నారు. ఆర్థికంగా ఎదుగుతున్న దేశాల్లో భారత్ ప్రస్తుతం 4వ స్థానంలో ఉందని మొదటి స్థానానికి తీసుకువచ్చే సత్తా మోదీకే ఉందన్నారు. యుద్ధంలో పాక్ సైన్యాన్ని మట్టికరిపించారన్నారు. అగ్రరాజ్యం అడ్డగోలుగా సుంకాలు పెంచినా భారత్ భయపడలేదని, త్వరలోనే ఇరు దేశాలు చర్చలు జరిపి మళ్లీ సుంకాలు తగ్గించే విధంగా మోదీ చర్యలు తీసుకుంటారన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బోడావుల జగదీష్, బీజేపీ నాయకులు పైడిపాటి శివశంకర్, పేరిచర్ల ప్రసాద రాజు, గరికిపాటి రాంబాబు, సమయం ఏసుబాబు, టీడీపీ నేతలు పెన్మెత్స త్రినాథ రాజు, బీకెఎం నాని, పూల రామచంద్రరావు, కైకలూరు సర్పంచ్ కెవిఎస్‌ఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీ

మండవల్లి: మండవల్లి తరుగుమూలలో 2006లో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలకు బుధవారం ఎమ్మెల్యే కామినేని నాగేంద్రస్వామి ఆలయం వద్ద పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 19 ఏళ్ల నుంచి లబ్దిదారులకు ఇళ్లపట్టాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. త్వరలో ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ప్రధానమంత్రి మోడీ పుట్టినరోజు పురస్కరించుకొని లింగాలలో సర్పంచ్ బోయిడి ధనలక్ష్మి సురేష్ ఏర్పాటుచేసిన కేక్‌ను కామినేని కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకల్లో వక్తలు

మోదీ చిత్రపటాలకు పాలాభిషేకాలు

ముదినేపల్లి: బీజేపీ ముదినేపల్లి మండల కార్యాలయంలో పార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రధాని పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి 150 మంది పేదలకు వస్త్రాలను అందజేశారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ నరసింహారావు, నియోజకవర్గ బీజేపీ కో-ఆర్డినేటర్ పైడిపాటి శివశంకర్, మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి: ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు కలిదిండిలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. తొలుత బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, అంకాల దుర్గా ప్రసాద్, చిట్టూరి రవీంద్ర, బాండు రాజు, చక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: బుధవారం స్థానిక చిన్నగాంధీబొమ్మ సెంటర్లో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నూజివీడు నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి కేక్‌కట్ చేసి స్థానికులకు పంచారు. పట్టణ బీజేపీ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం నూజివీడు బాలికోన్నత పాఠశాలలో బీజేపీ శ్రేణులు స్వచ్ఛభారత్ నిర్వహించాయి. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బోను అప్పారావు, నాయకులు ఎం.రాజశేఖర్, బావరాజు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: ప్రధాని మోదీ సుపరిపాలనతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్నాదని, భవిష్యత్తులో భారత్ ప్రపంచ శక్తిగా ఎదుగుతుందని పలువురు బీజేపీ నాయకులు అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా చాట్రాయి సెంటర్‌లో బీజేపీ శ్రేణులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు మందపాటి బసవారెడ్డి, ఓబిశ్శనేని రాజా, సంజీవరెడ్డి, డి శ్రీనివాసరావు, శ్రీకాంత్, కొండలరావు, కోటేశ్వరరావు, శ్రీకర్, చాగంటి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: నూజివీడు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ జి.ఆర్.కె రంగారావు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి బస్టాండ్ వద్ద ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనలో భారత్‌దేశం ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

కలిదిండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పడమటిపాలెం గ్రామంలో రాములోరి ఆలయం వద్ద గ్రామస్థులు 41 రోజుల సీతారాముల దీక్షను బుధవారం ముగించుకుని సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లస్కర్ల కొరత

(5వ పేజీ తరువాయి)

రెగ్యులర్ లస్కర్లు 38 మంది ఉన్నారు. అవుట్ సోర్సింగ్ కింద కనీసం 300 లస్కర్ పోస్టులను మంజూరు చేయాలని కోరుతుంటే కేవలం 190 పోస్టులను అవుట్ సోర్సింగ్ పోస్టులతోనే సరిపెడుతున్నారు. వాస్తవంగా 12 నెలలకు విధుల్లోకి తీసుకుని కేవలం పది నెలలకే రూ.10,300 వేతనం ఇస్తున్నారు. ఈ వేతనాన్ని రూ.15 వేలకు పెంచాలని, 12 నెలలు కాలానికి నియామకం చేయాలని కోరుతున్న జలవనరులశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఆప్కాస్ కింద వీరి నియామకం చేయాలని కోరుతున్న పదేళ్ల నుంచి అరకొర సిబ్బందే సాగునీటి కాల్వల నిర్వహణ చేపట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా మెయిన్ ఇరిగేషన్ పరిధిలో మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల 20 మంది కనీసంగా పనిచేయాల్సి ఉంది. ఎర్రకాల్వ, జల్లేరు, తమ్మిలేరు కొవ్వాడ కాల్వల కిందిస్థాయి రెగ్యులర్ సిబ్బంది అడపాదడపా వరదలొచ్చినప్పుడు అక్కడ లాకుల నిర్వహణ చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు ఈ శాఖ మంత్రిగా ఉన్న నేపథ్యంలో లస్కర్ల సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పేదింటికి వరం!

(5వ పేజీ తరువాయి)

ప్రకటించిన రూ.2.50 లక్షల రాయితీ వర్తిస్తుంది. ఇంకా జిల్లాలో సొంతింటి స్థలం ఉన్న లబ్దిదారులు ఈ పథకం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. తగిన ఆధారాలు అంటే ఆధార్ కార్డు, కుల, ఆదాయ, స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు/ ల్యాండ్ పొజిషన్ సర్టిఫికేట్ వంటి ధ్రువపత్రాలను అందజేసి దరఖాస్తు చేసుకోవాలి.

ఇళ్ల నిర్మాణంలో మూడోస్థానం

ఈ ఏడాది జిల్లాలో పీఎంఏవై అర్బన్/ పీఎంఏవై గ్రామీణ్‌లో 12,345 గృహాలు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఇప్పటివరకు 12,022 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఏలూరు జిల్లా 3వ స్థానంలో నిలిచింది. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

'ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సహించం'

కైకలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌పై మాజీ సర్పంచ్ డీఎం నవరత్నకుమారి వ్యాఖ్యలను వార్డు సభ్యులు తీవ్రస్థాయిలో ఖండించారు. బుధవారం కైకలూరు పంచాయతీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల మాజీ ఎంపీ హర్షకుమార్ వచ్చిన సమయంలో నవరత్నకుమారి తన పదవి పోవడానికి ఎమ్మెల్యే కామినేని కారణమని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. ఆమె అవినీతికి కామినేని సహకరించకపోవడంతో ఆయనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పది రోజులుగా గొడవలు జరుగుతున్నా దానగూడెం గ్రామం వెళ్లి బాధితులను పరామర్శించిన దాఖలాలు లేవని, మాజీ ఎంపీని తప్పుదోవ పట్టించారన్నారు. ఆమె రూ.4.4కోట్లు అవినీతికి పాల్పడినట్లుగా అధికారులు నిర్ధారించారని అందువల్లే ఆమె పదవి కోల్పోవలసి వచ్చిందని అంతే తప్ప ఇందులో ఎమ్మెల్యేకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇకపై ఇలాంటి అసత్య ఆరోపణలు ఎమ్మెల్యేపై చేస్తే సహించేదిలేదన్నారు. వార్డు సభ్యులు బెల్లాని శ్యామల రావు, సమతం శ్రీనివాసరావు, మేదూరి నాంచారయ్య, ఎండీ గాలిబ్‌బాబు, మంచిగంటి శ్రీనివాసరావు, పిచుకల జయసుధారాణి, పిచుకల శివరమ్య, బిరుదుగడ్డ రాజామణి, గిరి కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కైకలూరు గ్రామ వార్డు సభ్యులు



చీపురుగూడెంలో వైద్య శిబిరం



చెక్కపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డా. రమ్య

మహిళల ఆరోగ్యం, బలమైన కుటుంబాలే లక్ష్యం

చాట్రాయి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం, బలమైన కుటుంబాలే స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ లక్ష్యమని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని చీపురుగూడెం, చిన్నంపేట గ్రామాల్లో బుధవారం వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి 232 మందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార స్టాల్ ఏర్పాటు చేసి, సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ ఓబిళ్ళనేని సరోజిని, అంగన్వాడీ సూపర్‌వైజర్ గాయత్రి కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి: తాడినాడ ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధి కారిణి జాహ్నవి తెలిపారు. అక్టోబరు 2వ తేదీ వరకు మండలంలో ప్రతి గ్రామంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాడినాడ సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నా రు.

ముసునూరు: మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావులు అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం చెక్కపల్లి, వలసపల్లి, గోపవరం గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. వైద్యాధికారులు డాక్టర్ షకీనా ఇవాంజలి, డాక్టర్ రమ్య మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చెక్కపల్లిలో 252 మంది, వలసపల్లిలో 156, గోపవరంలో 153 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. ముఖ్యంగా 9 మంది గర్భవతులతో పాటు ఆరుగురికి గర్భాశయ క్యాన్సర్, 13 మందికి రొమ్ము క్యాన్సర్, 10 మందికి గొంతు క్యాన్సర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. 10మందికి కంటి ఆపరేషన్‌ల కోసం రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక శోభనాచల లక్ష్మీనరసింహ వేద పాఠశాల సమీపంలో స్వామికి చెందిన పూల తోటకు బుధవారం దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు వేలం నిర్వహించారు. సూరి భగవంతం నాలెడ్జి సెంటర్ సభ్యుడు కడియాల రవి ప్రసాద్ వేలంలో అత్యధిక పాట పాడి దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఆలయానికి టీవీ బహూకరణ

ముదినేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చేవూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్, శ్రీహరిపురం గ్రామానికి చెందిన పాతూరి మల్లిఖార్జునరావు దంపతులు రూ. 75 వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

కలిదిండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ కలసికట్టుగా పంట పొలాల్లో సామూహికంగా ఎలుకలను నిర్మూలించాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం సానారుద్రవరంలో ఎలుకల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలుకలు వరి పిలకలను కొరకటంతో పొట్ట దశలో ఎక్కువగా నష్టం వాటిల్లుతుందన్నారు. ఎలుకల నివారణకు సామూహికంగా రైతులందరూ ఎలుకల బుట్టలను ఎకరానికి 20 చొప్పున పెట్టాలన్నారు. బ్రోమోడయోలిన్ మందును ఎలుకలు బొరియల వద్ద పెట్టాలన్నారు.

ఉచితంగా ఎలుకల నివారణ మందు పంపిణీ

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం చిగురుకోట సహకార సంఘంలో బుధవారం వ్యవసాయ శాఖ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం కింద ఉచితంగా మందులను రైతులకు అందజేసింది. ఈ మందులను సంఘ అధ్యక్షుడు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు అందజేశారు. నాయకులు కందేపి నరేంద్ర, నాగళ్ళ గణేష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ముసునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోషకాహారం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని తహసీల్దార్ దాసరి ప్రశాంతి అన్నారు. రాష్ట్రీయ పోషక మహోత్సవంలో భాగంగా గోపవరం, చెక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహార పదార్థాలు, ఆకుకూరల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. గోపవరంలో స్టాల్స్‌ను తహసీల్దార్, చెక్కపల్లిలో సర్పంచ్ తల్లిబోయిన రాధికా సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు కాటేపల్లి సత్యనారయణ, మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు తదితరులు సందర్శించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే పదార్థాలను తయారు చేసుకునే విధానాన్ని చేసి చూపించారు. కిశోర బాలికలకు రక్త పరీక్షలను నిర్వహించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు డాక్టర్ షకీనా ఇవాంజలి, డాక్టర్ రమ్య వివరించారు.

అపరిమిత ఔషధాల వినియోగం హానికరం

ముదినేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సూచనల మేరకే ప్రజలు ఔషధాలను వినియోగించుకోవాలని ముదినేపల్లి విజయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్ కుమార్ అన్నారు. జాతీయ ఫార్మాకోవిజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా బుధవారం ముదినేపల్లిలో స్థానిక ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఔషధాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ తనూజ ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఆగిరిపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఈదులగూడెంలో జరిగింది. ఈర్ల దుర్గారావు (42) మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉరి వేసుకున్న తండ్రిని చూసి కుమార్తె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి, కొన ఊపిరితో ఉన్న దుర్గారావును నూజివీడు అమెరికన్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దుర్గారావు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం తాగవద్దన్నారని మనస్తాపంతో ఆత్మహత్య

ముదినేపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించినా మద్యం తాగడం మానలేని ఓ వ్యక్తి చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం ముదినేపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన జుజ్జవరపు రాజు (36) ఇటీవలి కాలంలో మద్యానికి పూర్తిగా బానిసయ్యాడు. తరచు అతని భార్య, కుమార్తెలు, బంధువులు మద్యం సేవించడం ఆపేయమని చెబుతున్నారు. మద్యం తాగనిదే ఉండలేని రాజు ఈ నెల 9న తమ ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగి వాంతులు చేసుకోవడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని వెంటనే గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్ళి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాజు మరణించాడు. అతని భార్య గ్లోరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి వాహనం చోరీ

కలిదిండి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కత్తితో బెదిరించి ద్విచక్ర వాహనాన్ని ఆగంతుకుడు చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. కలిదిండికి చెందిన తలారి కిరణ్ (33) తన బుల్లెట్ వాహనాన్ని రూ.2.30 లక్షలకు ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి పెట్టారు. జూలై 1న గుర్తు తెలియని వ్యక్తి కిరణ్‌కి ఫోన్ చేసి వాహనాన్ని తాను కొనుగోలు చేస్తానని చూపించటానికి మద్వానిగూడెం రమ్మని కోరాడు. దీంతో కిరణ్ తన వాహనంతో మద్వానిగూడెం వెళ్లి ఆ వ్యక్తికి చూపించాడు. బండిని ఓసారి నడిపి చూసుకుంటానని కిరణ్‌ను ఎక్కించుకుని కొంత దూరం వెళ్లాక కిరణ్‌ను కత్తితో బెదిరించి వాహనంతో పరారయ్యాడు. అప్పటి నుంచి వెతికినా వాహనం దొరకకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.